ప్రణయ లేఖలు

హుస్సేన్‌సాగర్‌లో చొచ్చుకుపోయిన బోట్ క్లబ్బు వరండాలో పండు వెన్నెలలో కూర్చుని నీటి అలలపైన సుధాకరుడు ఒయ్యారంగా ప్రతిబింబిస్తూ పయనిస్తుండగా చూస్తుంటే ఎటువంటి వాళ్ళకయినా కవిత్వం పుట్టుకొస్తుంది. అలా కవిత్వం చెప్పలేని ముగ్గురు మిత్రులకు భావోద్వేగం బుస్సున పొంగుకుంటూ పైకి లేచింది వెన్నెలరేడును చూడగానే.

రాత్రి ఏడు గంటల సమయం చల్లగా-మెల్లగా నీటిమీది నుంచి గాలి వీస్తోంది. రేరాజు తన నిండు బింబాన్ని మహా ఠీవిగా పోనిస్తున్నాడు - తెలి మబ్బులలో నుంచి హుస్సేన్‌సాగర్ రైలు కట్టదగ్గర బారులు తీర్చిన విద్యుద్దీపాలు మణిహారంలా మెరిసిపోతూ తమ నీడలను నీటిలో చూచుకుంటూ మురిసిపోతున్నాయి. ఆ రసమయ ప్రకృతికి ముగ్ధులైన ఆ ముగ్గురు మిత్రులూ పరవశించిన హృదయాలతో ఒకరి కొకరు ఏదో చెప్పుకుని తమ విస్మయానందాలతో భాగం పంచుకోవాలని ఉబలాటపడిపోతున్నారు

ఆ ముగ్గురిలో ప్రిన్సిపాల్ నరహరి పారవశ్యంతో కళ్ళు మూసుకుని "జీవితంలో అత్యంత మధురమైన కాలాన్ని తలుచుకుంటే ఆకలిదప్పులు ఉండవు సుమా!" అన్నాడు.

"ఆ కాలాన్ని తలుచుకుంటూ దారిద్ర్యాన్నిబాధలనూ దాటుకుంటూపోవచ్చు" అన్నాడు డాక్టర్ పరమేశం.

"పీక్కుతినే రోగాలతో తీసుకుంటున్నా ఆ మధుర క్షణాలను తలుచుకుంటూ హాయిగా కాలం గడపవచ్చు" అన్నాడు జడ్జి శివరావ్.

ముగ్గురూ ఎవరికివారే పరవశించి పోతున్నారు. వాళ్ళ మధ్య అరగంటసేపు నిశ్శబ్దము తారట్లాడింది.

"మీ జీవితంలో అత్యంత మధురమైన కాలం చాలా ఉజ్వలంగా ఉండేదేమో కదూ నరహరీ" అన్నాడు డాక్టరు పరమేశం కళ్ళు సన్నగా చీలికలు చేసుకుని చూస్తూ.

ముగ్గురూ ఉద్యోగ విరమణ చేసిన ఉన్నతోద్యోగులు. సాయంకాలపు వేళల్లో చేతిలో కర్రలు పట్టుకుని హుస్సేన్‌సాగర్ దగ్గిరికి వస్తారు. బోట్ క్లబ్బు సభ్యులు కనుక క్లబ్బు వరండాలో కూర్చుని కబుర్లు చెప్పుకుంటారు. మొదట "ఏమండీ"తో ప్రారంభమయిన స్నేహము "నీవు" క్రిందికి దిగింది. రెండు వారాలకే.

"నా జీవితంలోనా? అయ్యోపరమేశం? అంతటి అదృష్టం లేదయ్యా బాబూ నాకు!" బీద అరుపు అరిచాడు నరహరి.

"అదేమిటి? జీవితంలో లేకపోతే తలుచుకోవటం ఎలా సంభవం? దాన్ని తలుచుకుంటూ ఆకలిదప్పులు మరవటం ఎలా?" అంటూ నోరు తెరిచాడు పరమేశం.

"ఎలాగా? మొదట నౌకరుచేత ఒక సిగరెట్ ప్యాకెట్ తెప్పించు" అన్నాడు నరహరి ఆజ్ఞాపిస్తున్నట్లుగా బోట్ క్లబ్బులో మెంబర్లవాలని వరదాపడ్డారు గాని ఆ ముగ్గురికీ పాపం సారా నిషేధం ముట్టుకోవడానికి డాక్టరు పర్మిషన్‌లేదు. అందుకని కోకాకోలా తెప్పించుకుని సరదా తీర్చుకుంటారు. ఒక్కొక్కసారి సిగరెట్లతోనే సంతృప్తిపడుతూ కబుర్లు చెప్పుకుంటారు.

డాక్టరు పరమేశం కేకవెయ్యగానే ముగ్గురికీ మూడు ప్యాకెట్లు తెచ్చి యిచ్చాడు నౌకరు

నరహరి ఏం చెబుతాడో ననుకుంటూ ఆయన ముఖంలోకి చూస్తున్నారు పరమేశం శివరావులు.

నరహరి ప్రిన్సిపల్‌గా హైదరాబాదుకు బదిలీ అవగానే హోటల్ ప్రకాశ్‌లో దిగి చార్జి తీసుకున్నాడు. తనకొక మంచి ఇల్లు చూచి పెట్టమని అసిస్టెంట్లకు ఆనాడే చెప్పాడు. ఆ యిల్లు విడిగా స్వతంత్రంగా ఉండాలిగాని ఓబా\ంగా ఉండకూడదని షరతుపెట్టాడు. అది కూడా కాలేజికి దగ్గరగా వుంటే బాగుంటుందన్న సూచన చేశాడు.

వారం-పదిరోజులు గడుస్తున్నాయికాని నరహరి కోరిన విధంగా-ఇస్తానన్న అద్దెలో ఇల్లు కుదరలేదు. ప్రతిరోజూ అసిస్టెంట్లతో ఒక గంటసేపు ఇంటిని గురించి చర్చలు చేసేవాడు. ఇల్లు కుదరలేదు. హోటల్లో రోజుకు పదిహేను రూపాయలు-ఇవికాక భోజనాదులకు ప్రత్యేకంగా ఛార్జీలు.

పదిహేను రోజులు చూసిన తరువాత ఒకనాడు "ఏదో ఒక ఇల్లు కుదర్చండి త్వరగా. నాకు మా ఆవిడ రోజు కొక ఉత్తరం వ్రాస్తూంది. ఇంకో నాలుగు రోజులు చూసి హోటల్ గదికే వచ్చేస్తుంది'' అంటూ తన పట్టును కాస్త సడలించు కున్నాడు నరహరి. వెంటనే కాలేజీకి దగ్గరగా ఒక భాగం-మూడు గదులూ బాత్ రూం గల ఇంటిని ఇంగ్లీషు లెక్చరరూ కెమిస్ట్రి లెక్చరరూ కుదిర్చి నూట డెభ్భై ఐదు రూపాయలు ఎడ్వాన్సు ఇచ్చి తాళం వేసుకు వచ్చారు.

విధిలేక ఒప్పుకున్నట్టు తల ఆడిస్తూ ప్రిన్సిపల్ నరహరి ఆ యింట్లో సాయంకాలము ఆరుగంటలకు ప్రవేశించాడు. ముందు గది విశాలంగానే ఉంది దానికి పెద్ద పెద్ద కిటికీలు రెండున్నాయి. ఒక గోడ అల్మేరా ఉంది. గదిశుభ్రంగా రంగువేసి ఉన్నది. రెండు వైపులా దీపాలు మధ్య ఫాను పెట్టుకోవడానికి ఏర్పాట్లూ ఉన్నాయి. రెండవ గదిలో ఒక్కటే కిటికీ ఉన్నది. దాని పక్కగా బట్టలు పెట్టకోవటానికీ కోట్లూ ప్యాంట్లూ తగిలించుకోవటానికి తగిన ఏర్పాట్లు వున్నాయి. చెప్పులూ బూట్లూ క్రిందపెట్టుకోవచ్చు. ఆ అల్మేరాకు తలుపులున్నాయి తాళం వేసుకోవచ్చు.

మూడవగది అంటే వంటకూ సామానుకూ కలిసి ఒకటే గది. వంట యింటి ఏర్పాట్లు అన్నీ చూసి నీళ్ళ గదిలోకి తొంగిచూసి మళ్ళా రెండవ గదిలోకి వచ్చి నిలబడ్డాడు నరహరి.

ఇల్లు చిన్నదయినా-ఒక భాగమయినా-అందంగా ఉంది. తన భార్యకు నచ్చి తీరుతుందనుకున్నాడు నరహరి. అసిస్టెంట్లు ఇల్లంతా శుభ్రం చేయించారు. ఇంక సామాను సర్దుకోవటమే ననుకుంటూ ఆ సమీపంలోఉన్న హోటల్‌నుంచి భోజనం తెప్పించుకున్నాడు. పక్క పరచుకొని భోజనానంతరం ఒక సిగరెట్టు వెలిగించి పెట్టెలో ఉన్న బట్టలు అల్మేరాలో పెట్టాలని తలుపుతెరచి కొన్నిబట్టలుతగిలించాడు. షర్టు ధోవతులూ మడతలుచేసి పెడుతుండగా వేలికి చురుక్కుమన్నట్లయింది. అసలే

నరహరికి డయబిటిస్. ఏ మాత్రం దెబ్బ తగిలినా సెప్టిక్ అయిపోతుంది. చెయ్యి మురుక్కు-మనగానే టార్చివేసి చూశాడు. అదొక చిన్న అర. దానికొక గొళ్లెం ఎంతో పరీక్షగా ఒంగి చూస్తేగాని కనబడదు.

అది డబ్బుగాని నగలుగాని దాచుకునే అరకాబోలనుకున్నాడు. అంతటితో కుతూహలం ఆగక లోపలికి చెయ్యిపెట్టి చూశాడు. చేతికేమయినా తగులుతాయే మోనని. ఒక కవరు చేతికి తగిలింది. అయ్యో! పాపం! ఎవరో-అదివరకూ ఉన్న వాళ్ళు మరచిపోయి ఉంటారు. డబ్బుగాని-డిపాజిట్లుగాని ఏదయినా సరే ఎడ్రసు కనుక్కొని వాళ్ళకందజేయాలని నిశ్చయించుకున్నాడు.

ఆ కవరులో తప్పకుండా ఎడ్రసు ఉండే ఉంటుందనుకుని తెరిచిచూశాడు. చిన్నవీ పెద్దవి కాగితపు మడతలు. అవన్నీ తీసి చూస్తే తప్పకుండా ఎడ్రసు దొరుకుతుంది. పంపితే వాళ్ళెంతో సంతోషిస్తారు అనుకుని కాగితాలు పైకి తీశాడు.

అక్షరాల వెంట కళ్ళు పరుగెత్తుతుంటే అతడి కళ్ళు చేరెడయ్యాయి. కను బొమలు పైకి లేచాయి. ఒంటినిండా విద్యుత్తు ప్రవహించినట్లయింది.

ఓ! ఇవి ప్రణయలేఖలు. పాపం! ఎవరికి ఎవరు రాశారో!

ప్రణయ లేఖలను కోగానే అతడి ఒళ్ళు జలదరించింది. అవును, అతడికి అవి కొత్త. కాలేజిలో చదువుకునే రోజుల్లో ఆడపిల్లలెవరికీ రాయలేదు. ఇతరత్రా అమ్మాయి లెవరూ లేరు. అలాంటి ఉత్తరాలు రాయటానికి. ఇంకపోతే భార్యా మణి, ఆమే మేనమామ కూతురు. ఉత్తరాలు రాయవలసిన అవసరం రాలేదు. ఇల్లరికపుటల్లుడు అదీగాక నరహరి భార్య విశాలాక్షమ్మకు మనసులో ఉన్నది బైటపడితే విలువ తగ్గిపోతుందనే రకం మనిషి. ఆమెకు ప్రణయమన్నా ప్రేమన్నా అట్టే నమ్మకంలేదు.

మళ్ళా ఉత్తరం తెరచి చూశాడు. ఆ సంబోధనే హృదయాన్ని గిలిగింతలు పెడుతోంది.

ఇట్లా రాసుకుంటారా ప్రణయ లేఖలు!

"మనకు రెండు సంవత్సరాలూ రెండు నిమిషాలలా గడిచిపోయాయి. అవి ఈ లోకపు రోజులుకావు సురేష్! ఇవి దేవేంద్ర లోకంలో గడిచిన రోజులు.

నీకూ నాకూ రాత్రికీ పగటికీ భేదం తెలియని రోజులు. నిజంగా మన్ని చూపి ఎవరికో కన్ను కుట్టింది. అందుకే నిన్ను కదిలించలేక—నన్ను ట్రాన్స్ఫరు చేశారు. అంతటితో మన ప్రేమను నశింపచేయగలిగామనుకున్నారు. ఇక్కడ నా ఉద్యోగం బాగా జరిగిపోతోంది. నీవు ఏదో ఒక వంక పెట్టుకుని వస్తూ ఉండు సురేష్. అన్నట్టు చెప్పటం మరిచిపోయాను. నీవు దూరంగా ఉన్నాననుకుంటున్నావుగాని నా దగ్గరే ఉన్నావు. నాలో ఉన్నావు. నా గర్భంలో పెరుగుతున్నావు. నిజంగా నీవు ఇవాళ నా ఎదురుగుండా ఉంటే ఈ శుభవార్తను నీ కెట్లా అందించేదాన్నో! నీవు విని ఎట్లా సంతోషపడేవాడివో? ఊహామాత్రాన నా మనసు ఏదో ఏదో అయిపోతున్నది. ఏం చేస్తాం? తప్పదు. నీవొకచోట నేనొకచోట.”

కళ్ళు విప్పుకుని చివర నున్న సంతకం చదివాడు. సరళ!

బరువుగా నిట్టూర్చాడు.

రెండో ఉత్తరం విప్పాడు.

“అబ్బబ్బ! సురేష్, ఉత్తరాలెందుకు ఇలా ఆలస్యంగా రాస్తున్నావు? మొన్నటి నా ఉత్తరానికి ఏదీ జవాబు? నే నెంతో సంతోషిస్తావని శుభవార్త రాస్తే నీ దగ్గర నుంచి ఉత్తరమే లేదే! బహుశః పనిలో మునిగిపోయి ఉన్నావేమో! పాపం, నిన్ను అన్యాయంగా మాటలనటం నాకో అలవాటు. ఆ అలవాటును మానేయాలనుకుంటాను. కాని చేతకావటంలేదు. మొదట ఏదో పది మాటలంటాను. తరువాత పశ్చాత్తాపంతో నన్ను నేనే తిట్టుకుంటాను.”

మరొక ఉత్తరం తీశాడు నరహరి.

“అబ్బబ్బ! సురేష్. ఎప్పుడు చూసినా పని-పని-అంటావు. నీవు సెలవు పెట్టి రావటం ఏమయింది? ఇప్పుడు ఒక్కసారి నన్ను చూడాలనిపించటం లేదా? ఏమిటో నీవు వస్తే ఎన్నో సంగతులు చెప్పాలనీ ముందు సంగతులెన్నో మాట్లాడాలనీ నా మనసు గంతులు వేస్తున్నది. ఒక్కసారి రా సురేష్. సెలవుపెట్టు. ఏదో వంకపెట్టి వచ్చెయ్యి.”

నరహరి మనసు కరిగిపోయింది. పాపం! ఆవిడి తన తొలి గర్భాన్ని గురించి అతడికి ఎంత ప్రేమతో చెప్పాలనుకుందో? దానికి అతడెంద మురిపెంగా

జవాబిచ్చాడో? నరహరి ఒళ్లు గగుర్పొడిచింది తనకే మురిపాలూలేవు. ఉత్తరాలూ లేవు ఏదో గుడ్డెద్దు చేలో పడ్డట్టు జీవితం సాగిపోతోంది.

"సురేష్! ఈ సెలవుల్లో కూడా రాలేదు కదూ? నీవు మనసు మార్చుకుంటావేమోనని భయంగా వుంది. నీవు మారిపోతున్నట్లు నాకనుమానంగా ఉంది. ఇదంతా ఎందుకు? రిజిస్టర్ మ్యారేజి ఇప్పుడయినా చేసుకుందాము పద. ఏమిటో—ఇంతకాలం అనిపించలేదు కాని-ఇప్పుడేమనిపిస్తోందంటే మన ఇద్దరి కలయికా చట్టబద్ధంగా ఉండాలని. అంతకు ముందు ఎవరేమనుకుంటే మనకేమనుకున్నాను. కాని-నీ రూపం నాలో పెరుగుతున్న కొద్దీ అందరూ మన కలయికను గుర్తించాలనిపిస్తోంది. మనంపడ్డ సంతోషం అందరూ పడితేగాని మనసుకు సంతోషం ఉండదేమోననిపిస్తోంది. అన్నట్టు సురేష్! నీకు వస్తుందనుకున్న ప్రమోషన్ వచ్చిందా? నాకొచ్చింది. నీవడిగితేగాని చెప్పకూడదనుకుంటాను కాని నీలాగ నిబ్బరం లేదు నాకు. నీకు చెప్పేవరకూ నా మనసాగదు.

ఓహో! ఇది ప్రణయమే-పెళ్ళికాని ప్రణయం! అయితే, పెళ్ళి అయితే ప్రణయముండదా? ప్రేమగా మారుతుందా? ప్రణయానికి, ప్రేమకూ ఏమైనా తేడా ఉన్నదా? తల చేత్తో తడిమి చూసుకున్నాడు నరహరి

"సురేష్! నీవు నా మనసుకు మకుటంలేని రాజువు. ఎంత చదువుకున్నా ఉద్యోగం చేస్తున్నా నిన్నుచూడగానే నీలో ఇమిడిపోయే మనస్తత్వమేమిటి నాకు? అంత ఒళ్ళు తెలియకపోవట మేమిటి? నీతో ఏదో ఏదో లోకాలకు రెక్కలు కట్టుకుని ఎగిరిపోవాలనుంటుంది ఎప్పుడూ! మొట్టమొదట మనిద్దరికీ పరిచయమైన ఆ మామిడిచెట్టు నీడను చూస్తే ఇప్పటికీ నామనసెంతో పొంగులువారుతూ ఉంటుంది. జీవితంలో ఎవరైనా చీకట్లు ఉన్నాయని తలుచుకుంటూ దుఃఖిస్తుంటే నాకు నవ్వొస్తుంది. ప్రేమ అనే వెలుగుచూడని అంధులన్నమాట వాళ్ళు. సురేష్! ఈ ప్రేమ జలధికి అంచులున్న యంటావా? లోతు నెవరయినా కొలవగలరంటావా? అసలు కొలత బద్దనేది ఉంటుందంటావా? ఈ జలధిని చూస్తూ విస్మయ పడటం తప్ప నాకు మరొకటి తోచటం లేదు సుమా!"

నరహరి అన్ని ఉత్తరాలూ ఒక్కరోజే చదివి హరించుకోలేననుకున్నాడు. యధా ప్రకారం ఉత్తరాలన్నీ మడచి ఆ కవరులో పెట్టేసి అల్మేరా రహస్య స్థలంలో వాటిని భద్రపరచి తాళం వేశాడు.

పక్కమీదికి ఒరిగాడన్నమాటేగాని కంటిమీదికి నిద్రరాలేదు. ఒక రాత్రి లేచి హీటర్‌మీద నీళ్ళు కాగపెట్టుకుని హార్లిక్సు కలుపుకుని తాగాడు. రెండు సిగరెట్లు పీల్చేడు. లేచి మిగిలిన బట్టలన్నీ చక్కగా సర్దుకుని మళ్ళీ ఉత్తరాలకట్ట చేతిలోకి తీసుకున్నాడు.

సురేష్ః రాత్రి నిద్రపట్టక ఒక నవల చేతిలోకి తీసుకున్నాడు కథానాయకుడు పదకొండు మంది పిల్లల తండ్రి. ఉద్యోగరీత్యా ఒక డాక్ బంగళాలో క్యాంపు వేసుకి దిగాడు. పక్కగదిలో ఒక గాయని దిగింది. ఇద్దరూ మెట్లమీద కలుసుకుంటారు ఒక సాయంత్రం ఆ చూపులలోనే ప్రణయం ప్రారంభమయింది. పదిహేను రోజు లయినా కథానాయకుడు ఆ ఊరు వచ్చిన పని కాలేదు. ఆమె పాట కచ్చేరీలయిపోయినా అక్కడే ఉండిపోయింది" అంతమంది పిల్లల తండ్రికి ఆ పరాయి పిల్లతో ప్రణయం సాధ్యమా అనుకుంటూ- సాధ్యమే నేమోః ఇద్దరూ కలిసి క్యాంపులు వేసుకుంటూ కాలం గడుపుతున్నారు. చివరకు ఆ కథానాయకుడు ఆపదకొండు మంది పిల్లల తల్లినీ వదిలిపెట్టి ఆ గాయనిని రిజిష్టర్ మేరేజి చేసుకున్నాడు. ఎన్నేళ్ళున్నా మగవాడికి ప్రణయమనగానే చిన్నపిల్లవాడయిపోతాడు కాబోలు. ఎట్లాగయినా ప్రణయం అనేది తెలుసుకుని అనుభవిస్తూ బ్రతకటంలోనూ ఏమీ తెలియకుండా మోడు బ్రతుకుబ్రతకటంలోనూ చాలా తేడా ఉంటుందనుకుంటాను. ఏమంటావ్ సురేష్!'' ఎప్పుడూ నీకోసం కలలుకనే

సీ

ప ర శ

ఎందుకో నరహరికి చురుక్కుమన్నట్లయింది. బరువుగా నిట్టూర్చి ఆ ఉత్తరం మడతవేసి కవరులో పెట్టాడు. అంతలో తెల్లవారింది. కాలేజిప్యూను తలుపుకొట్టాడు. ఇల్లంతా శుభ్రంచేసి కాఫీ టిఫీన్‌కోసం ఫ్లాస్కు టిఫిన్‌కారియరూ తీసుకువెళ్ళాడు.

కాలేజిలో లెక్చెరర్లంతా ఒక మాదిరి మనుష్యులులా ఉన్నారు. పని చెప్పీ చెప్పకముందే ఊరికే పొగడ్తలు ప్రారంభిస్తారు. పొగడ్తలతో మెప్పించాలని చూస్తారుగాని-పని చేసి మెప్పించరు. వాళ్ళ విద్యుక్త ధర్మాలను జ్ఞాపకం చేయటానికి సందు ఇవ్వరు స్టాఫ్ మీటింగుల్లో కూడా ఇంతే. తను ఏదో చెప్పబోయే

అంతలో వాళ్ళు ముందుగానే గహించి అదే సంగతి గురుతర బాధ్యతగా భావించి చెప్పేస్తారు. కళాశాల పరిపాలన అంతా తామే-చూస్తామంటారు ''మీకెందుకూ శ్రమ? అంతా మేము చూసుకుంటాం కదా!'' అంటారు. వీళ్ళందరినీ ఒక దారికి తీసుకువచ్చి—ఎవరి బాధ్యతలను వాళ్ళకు గుర్తుచేసి కళాశాల వ్యవహారాలను చక్కదిద్దటానికి రెండు నెలలు పట్టింది. అలసిపోయి ఇంటికి వచ్చి భోజనంచేసి పడుకునేవాడు.

అతడు వచ్చిన ఇరవై రోజులకు పిల్లలు వచ్చి స్కూళ్ళల్లో చేరారు. భార్య మాత్రం రాలేదు. అన్నగారింటికి వెళ్ళింది. నిదానంగా వస్తానంటూ ఉత్తరం వ్రాసింది.

ఆనాడు రాత్రి నరహరికి తీరిక చిక్కింది. కళాశాలకు పెద్దలెవరో వచ్చారు. కళాశాలనూ ప్రిన్సిపల్ నరహరినీ స్టాఫ్‌నూ చాలా ప్రశంసించారు. ఉపాహార విందు జరిగింది. చివరకు ఒక గ్రూప్ ఫొటో తీసుకున్నారు. భోజనం చెయ్యగానే తాంబూలంతో పాటు సిగరెట్టు వెలిగించాడు. మళ్ళీ మనసు ప్రణయలేఖల మీదికి వెళ్ళింది. పిల్లలు పడుకునేవరకూ పేపరు చదివి, పక్కమీద నడుంవాల్చి ఉత్తరాల కట్ట అలేమారాలో నుంచి తీసుకున్నాడు చేతిలోకి.

''సురేష్, నీ రాక మాదిరిగానే నీ ఉత్తరాలు కూడా రాస్తా రాస్తా అంటావు రాయవు వస్తా వస్తా అంటావుగాని రావు. చాలా బిజీగా ఉన్నట్టు పోజులు కొడతావు. ఈ మధ్య ఎవరో అన్నారు. నీవు బదిలీకి ప్రయత్నము చేస్తున్నట్టుగా విన్నాను నిజమేనా? ఆ మాట విన్న తరువాత నా నిరుత్సాహమంతా మటు మాయమయిపోయింది. చురుకుదనం మళ్ళీ తలఎత్తింది. నీవు రాగానే మంచి ఇల్లు తీసుకుందాం ఊరికి దూరంగా, హాయిగా ప్రపంచమంతా మనకోసమే-ఈ ప్రకృతి-లోకంలోని సుఖాలూ, ఆనందాలూ, వినోదాలూ, అన్నీ మనకోసమే అన్నట్టు గడిపేద్దాం. అన్నట్టు సురేష్! నీ కారు బాగా పని చేస్తోందా? వచ్చేటప్పుడు సర్వీస్ చేయించి తీసుకురా. నా మనసుకు నీవు వచ్చినట్టుగానే ఉంది ఇప్పుడే.''

నరహరి ఆ ఉత్తరం మడిచి యథా స్థానంలో పెట్టేశాడు. ఎట్లాగయినా ఆడదానికి ఆవేదన ఎక్కువ. ఆడవాళ్ళకు ప్రేమేప్రాణం. కాని మగవాడికి ఎంత

ప్రేమ ఉన్నా ప్రాణం మాత్రం కాదు ఇది పురుషుడిలో ఉన్న లోపం కాదు, ప్రకృతి సిద్ధం అనుకుంటూ మరో ఉత్తరం తీశాడు.

"సురేష్! నీకు ఉత్తరాలు రాసి రాసి చేతులు నొప్పులు పుడుతున్నాయి. నీవు రావటం కాని—నీ ట్రాన్స్ఫరుగాని గగనకుసుమమయిపోయాయి. మొన్ననే డాక్టరు చెప్పింది వచ్చే వారంలో పురుడు రావచ్చునని. ఈ వయసులో కాన్పంటే నాకు పునర్జన్మ అన్నమాట. కాన్పు వచ్చే లోపల నిన్ను చూడాలనీ హాయిగా కులాసాగా కొన్ని రోజులయినా గడపాలనీ, కలలు కన్నాను. ఏం లాభం? నీవు రాకపోయినా ఇదివరకు ఎదురుగా ఉండి మాట్లాడినట్లే ఉత్తరాలు వ్రాసేవాడివి. వాటిని చదువుకుని-నీ సమక్షంలో సంతోషపడినట్లుగా ఆనందించేదాన్ని. నీ ఉత్తరాలు—ఆర్నెల్లకొకటి—అదయినా రెండే మాటలు. ఇప్పుడా ఉత్తరాలూ లేవు. ఈ ఉత్తరం చూసిన తరువాతయినా నీ చేత్తో రెండు ముక్కలు రాస్తావని ఆశిస్తున్నా"

నరహరికి ఈ ఉత్తరం ఆశాజనకంగా లేదు కేవలం నిరాశాపూరితంగా ఉంది. అతడి ఉత్సాహమంతా కృంగిపోయింది. యాంత్రికంగా మరొకటి తీశాడు.

"బిడ్డ పుట్టాడు వచ్చి చూడమని డాక్టరు చేత రెండు టెలిగ్రాము లిప్పించాను. నీవు రాలేదు పోనీ సంతోషమన్న టెలిగ్రామయినా నీ దగ్గరి నుంచి రాలేదు సమక్షంలో ఎన్నో కబుర్లు చెబుతావు. ఎంతో ప్రేమ కనబరుస్తావు. పరోక్షంలో ఏం పట్టనట్టు ఉంటావు. బిడ్డను చూడటానికి రమ్మంటే దాని తండ్రి ఉంటాడా? చూడటానికి రాలేని కారణం ఏమిటి? అంత బలమైన కారణాలా? నీకు తోచకపోయినా నీకు తెలియ జెప్పటం నా ధర్మం. వెంటనే బయలుదేరిరా. నీ ప్రతిబింబాన్ని ఒకసారి చూసి వెళ్ళు. ఆ ఉన్న రోజున మన పెళ్ళిని చట్టబద్ధం చేసుకుందాము. వస్తావు కదూ! నీ కోసం ఎదురు తెన్నులు చూసేది ఇంతవరకూ నే నొక్కదాన్నే ఇప్పుడు ఇద్దరం. మా ఆశలు వమ్ముచేయకు"

రాత్రిళ్ళు పడుకోబోయేటప్పుడు ఒక కప్పు వేడి వేడి పాలు తాగటం నరహరికి అలవాటు. పెద్ద కూతురు ఎప్పుడో ఒక కప్పు పాలు బల్లమీద పెట్టేసి వెళ్ళింది. వేడి పాలు తాగి ఒక సిగరెట్టు వెలిగించి గంట చూశాడు నరహరి. పన్నెండు గంటలు దాటుతున్నాయి. తెల్లవారి లేచి మళ్ళా యథాప్రకారంగా

కాలేజికి వెళ్ళి పనిచూసుకోవాలి. పరీక్షలు దగ్గరికి వస్తున్నాయి. విద్యార్థులు కూడా రాజకీయవేత్తలైపోతున్నారు. పరీక్షలు నడపటమంటే మాటలుకాదు. భయంపుట్టు కొస్తోంది. ఆ గండం గడిచేవరకూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఉండాలి.

ఈసారి నరహరి చేతికి వచ్చిన ఉత్తరం బయటికి లాగాడు.

''సురేష్! మనం ఆనందంగా గడిపిన రోజులయినా జ్ఞాపకం రావటం లేదా? ఎట్లా మరచిపోగలిగావు సురేష్? మన బోట్ షికార్లు—సినిమాలు—పిక్నిక్‌లూ అన్నీ మరిచిపోయావా? మనం ఈత కొట్టటంలో పోటీలుపడి తగాదాలు పడేవాళ్ళం. వీటిలో ఏ ఒక్కటి నీకు జ్ఞాపకం రావటంలేదా? నా కవన్నీ ఇప్పటికి కళ్ళకు కట్టినట్టున్నాయి. ఆ మధుర ఘట్టాలన్నీ కళ్ళముందరే ఉన్నాయి. తలుచుకున్నప్పుడల్లా నిత్యనూతనంగా ఉంటాయి. వాటిని తలుచుకుంటూ ఉత్సాహాన్ని పుంజుకుంటూ రోజులు గడుపుతున్నాను. సురేష్! మళ్ళీ అటువంటి రోజులు నా జీవితంలో తిరిగి రావా? ఏమోలే!''

మరొక్కటి చదివి ఆ రాత్రికి లేఖాపఠనం ఆపివేద్దామనుకున్నాడు నరహరి.

''సురేష్! నీ బిడ్డ మనుష్యుల్ని చూసి నవ్వటం నేర్చుకుంటున్నాడు. ఆ బోసి నవ్వులు చూసినప్పుడల్లా నీవే జ్ఞాపకానికి వస్తున్నావు. బిడ్డ నవ్వినప్పుడు నాకు కలిగే సంతోషాన్ని పంచుకోవటానికి నీవు దగ్గరలేవు కదా అనిపిస్తుంది. చూడ్డానికి ఎప్పుడు వస్తావు? బిడ్డ పాకేటప్పుడా? నడక వచ్చినప్పుడా? నాన్నా అని పిలిచేటప్పుడా? ఎప్పుడు వస్తావు?''

నరహరికి నిద్రవేళ తప్పిపోయింది. పక్కమీద మసలుతూ తెల్లవార్చటం ఎందుకు? మరో లేఖ తీసాడు.

''సురేష్! ఒక్కరోజు జ్వరంతో బిడ్డ నీవు చూడలేని లోకాలకు వెళ్ళి పోయాడు. ఎన్ని ఉత్తరాలు రాసాను నీకు వచ్చి చూడమని? తండ్రిలా ఒక్కసారి వచ్చి చూసి ఎత్తుకోలేకపోయావు. ఇది నీ ఉదాసీనమనుకోనా? నిర్లక్ష్యమనుకోనా? ఏమనుకోమంటావు? బిడ్డపట్ల ప్రేమలేని తండ్రి ఉంటాడా లోకంలో? ఉంటే నీవు ప్రథముడవు. కడుపుతీపి అంటే ఏమిటనుకున్నావు! అయినా నీకేంతెలుసులే- ఆ తీపిని రుచి చూచినదాన్ని నేను. ఇప్పుడాచిచ్చును భరించలేక అల్లాడిపోతున్న దాన్ని నేను. నీవు కఠినాతి కఠినుడవు.''

ఓ : కోపమొచ్చేసింది సరళమ్మకు కడుపు మండినవాళ్ళకు మర్యాదలేమిటి? చదివిన నరహరికి గుండెలో సన్నగా మంటలాంటిది బయలుదేరింది.

"సురేష్! తెలిసిపోయింది. నీ సంగతంతా తెలిసిపోయింది. నీవు ముఖం చాటు చేసుకునే మనిషివి. వంచకుడవు. నీకు హృదయం లేదు. ఉంటే నీది శిలాహృదయమన్న మాట. ఇటువంటి మనిషిని నాతో ఎందుకు చెలగాటలాడావు? తల్లీదండ్రీ లేకపోయినా ఇంత చదువుకుని ఉద్యోగం చేసుకుంటూ మర్యాదగా గుట్టుగా రోజులు గడుపుకుంటున్న నాకెందుకు ఆరసిల్లావు? తారసిల్లి నాలో ఎందుకు మధురభావాలను రేపావు? నాలో నిద్రించిన స్త్రీత్వాన్ని ఎందుకు మేలు కొలిపావు? ఆశలు ఎందుకు రేకెత్తించావు? చెప్పు? నా మానసిక సంక్షోభాని కంతకూ నీవే కారణమని ఒప్పుకుంటూ ఒక ఉత్తరం రాస్తావా?"

అయ్యో! సరళమ్మా! నీవూ మాయమాటలకు లొంగిపోయిన వంచితవేనా? నీ చదువులన్నీ ఏమయిపోయాయమ్మా! నరహరి మనసు కొద్దిగా కలవరపడ్డది.

"సురేష్! నీవు చేసిన మోసాన్ని మీ బాస్‌కంతా వివరంగా రాసేస్తాను. నీ ఉద్యోగం ఊడిపోతుంది. మంచి వాళ్ళకు మంచి చేయాలనిపిస్తుంది. ద్రోహికి ద్రోహమే చేయాలని పిస్తుంది ఎదురు చూస్తూ ఉండు- మీ బాస్ నిన్ను డిస్‌మిస్ చేస్తాడు."

అమ్మా! ఆడది తాచులాంటిది. పగపట్టిందంటే విడువదు. ఆ సురేష్ గాడికి మూడింది పాపం! నరహరి హృదయంలో చిన్నసానుభూతి రేఖ పొడ చూపింది.

"సురేష్! నీ పనులకు ఏడవాలో నవ్వాలో తెలియకుండా ఉన్నది. నీవు పంపిన నీ స్నేహితుడు వచ్చాడు. నీవు నాకు రాసిన ఉత్తరాలన్నీ ఇచ్చెయ్య మన్నాడు" పిల్లలు కలవాడు. "అతడి ఉద్యోగం ఊడతీసే పని చెయ్యద్దని" కాళ్ళమీద పడ్డాడు. నీ భార్య కంటికీ మంటికీ ఏకధారగా ఏడుస్తున్నదని ప్రాధేయ పడ్డాడు బాగానే నటించాడు ఎంత యిచ్చావేమిటి?"

"నీచుడా! ఆ ఉత్తరాలన్నీ కట్ట కట్టి వాడి ముఖాన పారేశాను. ఎందుకో తెలుసా? నీ వడిగినందుకూ కాదు. అతడు ప్రాధేయపడినందుకూ కాదు. వంచ

కుడూ మోసగాడూ రాసిన ఉత్తరాలలో ప్రేమ ఏముంటుంది? నిజమైన ప్రేమ లేఖలయితే వాటిని భద్రపరచుకుంటూ ఉండవచ్చు. నీ ఉత్తరాలలో మోసమూ దగా అంతా!

"ద్రోహి! నీ పాదాలు పలిగి రక్తము కారుతుంటే వేడినీళ్ళతో తుడిచి వ్యాజ్‌లైను రుద్ది బాగుచేశా నొకసారి. ఆ పాదాలతోనే నీ దేహాన్ని మోస్తూ తిరుగుతున్నావా? హీనుడా!"

తననే ఆ మాటలన్నట్టుగా భావించాడు కొంతసేపటివరకూ నరహరి. క్రమంగా సర్దుకున్నాడు!

ఉత్తరాలయిపోయాయి. వాటిని యథాప్రకారంగా మడతలు సరిగాపెట్టి కవరులో పెట్టాడు అరలో పెట్టి మూసేశాడు.

అయితే ఈ లేఖలన్నీ అతడికి వచ్చినవి, అతడు రాసినవన్నీ తెప్పించుకుని తగలపెట్టి ఉంటాడు. మరి – ఈ ఉత్తరాలు ఎందుకు భద్రపరచుకున్నారు. ఈ రహస్యపు సొరుగులో? మరచిపోయి ఉంటారా? లేక తను రాసినది తెప్పించు కున్నట్లే ఆమె రాసినవి ఆమెకు పంపేశాడా?

నరహరి కేమీ అర్థము కాలేదు. ఈ దిక్కుమాలిన ఉత్తరాలు చదవటంతో బుర్రంతా పాడయిపోయింది.

తెల్లవారటానికి ఇంకా ఒక గంట ఉంది. బద్ధకంగా మంచంమీద పడుకుని అటూ ఇటూ దొర్లాడు నరహరి.

కాఫీ తాగుతూ నరహరి ఆలోచిస్తున్నాడు. ఈ ఉత్తరాలను మరచిపోయిన వాళ్ళకు పంపాలని తను ఆరాట పడనక్కరలేదు. అలాగే ఆ సొరుగులో ఉండనీ అనుకున్నాడు.

ఉదయం తొమ్మిది గంటలకు కాలేజికి వెళ్ళాలని బైటికి వస్తుండగా "నాన్నా? నీ కోసం ఎవరో వచ్చారంటూ ఎదురుగా వచ్చింది కూతురు.

లోపలికి తీసుకురా అంటూ వెనక్కు మళ్లి కుర్చీలోకూర్చున్నాడు నరహరి.

వెలిసిపోయిన వాయిల్ చీరె కట్టుకుని కుంచించుకుపోయిన ముఖంతో ఉన్న తలనెరిసిపోయిన ఆమె లోపలికి వచ్చి కూర్చుంది.

ముఖం వాడిపోయినట్లుంది. సౌందర్యం చెక్కు చెదరకుండా ఉన్నది. ఆమెకు తనతో ఏం పనో నరహరి ఊహించలేకపోయాడు.

"ఏం కావాలమ్మా ? మీకు?" అడిగాడు-ఇంకా ఆలోచిస్తూ కూర్చుంటే కాలేజికి టైమయిపోతుందన్న తొందరలో.

"నేను ఈ ఇల్లు ఖాళీచేసి ఒక చిన్న యింట్లోకి మారాను. ఒంట్లో బాగుండక సామాన్లు సరిగా సర్దుకోలేకపోయాను. నిన్ననే అంతా సర్దుకున్నాను. నాది ఒక వస్తువు ఉండిపోయింది ఈ యింట్లో. మిమ్మల్ని అడిగి తీసుకువెళ్దామని వచ్చాను" అన్నది తల వంచుకొని:

అదేమిటో నరహరికి అర్థమయింది.

"ఏం వస్తువమ్మా మా కాలేజీ లెక్చరర్లు ఈ ఇల్లు కుదిర్చి కడిగించి నా కొప్పగించారు. నాకేం కనబడలేదు మరి" అన్నాడు.

"అది అందరికీ కనబడేచోటు కాదులెండి" అన్నది తలవంచుకుని.

"అట్లాగా! అయితే మీరే స్వయంగా తీసుకోండి" అన్నాడు.

ఆమె చివ్వున లేచి అల్మేరా తెరచి ఆ రహస్యపు సొరుగులో నుంచి ఆ కవరు తీసుకుని "నమస్కారమండీ!" అంటూ వెళ్ళిపోయింది.

ఆమెను కూర్చోబెట్టి మాట్లాడాలనీ-ఇప్పుడామె ఏం చేస్తోందో తెలుసుకోవాలనీ-కష్టసుఖాలు అడగాలనీ అనుకున్నాడు నరహరి కాని - ఆమె అతడికి ఆ అవకాశము ఇవ్వకుండా వడివడిగా అడుగులు వేస్తూ వెనక్కుతిరిగి చూడకుండా వెళ్ళిపోయింది.

ఈ సంఘటన తర్వాత నరహరి మనసు అదోలా అయిపోయింది. ప్రతి రోజూ ఆ ఉత్తరాలు జ్ఞాపకం వచ్చేవి.

అంతా విని డాక్టరు పరమేశం "నరహరీ ! నీ ప్రణయ లేఖలలో ప్రణయం కంటే బాధలే ఎక్కువగా ఉన్నాయి. అవి తలుచుకుంటే ఆకలి దప్పులు ఉండవు సుమా అవి అన్నావు. వీటిని తలుచుకునేనా?" గొల్లున నవ్వాడు.

"అలా నవ్వకు. ఆ ప్రణయిని చాలా వరకూ లేఖలు లేకుండానే ప్రేమ నంతా ఒలకపోసింది. లేఖల దశలోకి వచ్చేసరికి అది పలచబడి మరో మలుపు తిరిగింది. ప్రేమ ఎంత ఉజ్వలంగా ఉంటుందో. అది భగ్నమయినప్పుడు అంత పేలవుగానూ కరుకుగానూ ఉంటుంది. బొమ్మ బొరుసూ కూడా చూపించాను మరి" అన్నాడు నరహరి.

"అవునవును!" అన్నాడు జడ్జీ శివరావు.

2

"జీవితంలో అత్యంత మధురమైన ఘట్టాలను తలుచుకుంటూ ఎంత దారిద్ర్యాన్నియినా ఎన్ని బాధలయినా దాటుకుంటూ పోవచ్చు"నన్నావుజ్ఞాపకముందా పరమేశం?" అన్నాడు జడ్జీ శివరావు-పరమేశం ఛాన్సు వచ్చిందని సూచిస్తూ.

పరమేశం హైదరాబాదు వచ్చిన తరువాత జరదా వేసిన బీడాలు తినడం అలవాటు చేసుకున్నాడు. అది పుక్కిట బెట్టుకుని ఎంతసేపయినా మాట్లాడతాడు ఆ బీడా వేసుకుంటే అతడికి ఎక్కడలేని ఉత్సాహం పుట్టుకువస్తుంది. జేబులోంచి తళ తళ మెరసే దబ్బా ఒకటి బయటకి తీశాడు దానిలో నుంచి నాజూకుగా రెండు వేళ్ళతో వెండు తమలపాకులతో మడిచిపెట్టిన జోడు బీడాలను సున్నితంగా తీసి నోట్లో పెట్టుకుని, ఒక చిన్న సీసాలో నుంచి జరదాను ఎడమచేతిలో రాల్చుకుని నాలుకమీద వేసుకుని నమిలాడు. ఆ ఘాటుకు ముఖమంతా ఎర్రబడ్డది. కొంత సేపటికి తేరుకుని ఊఁ అన్నాడు

"అయితే మొదలు పెడుతున్నావన్న మాట" అన్నారు శివరావూ నరహరీ.

అది రెండవ ప్రపంచ మహాయుద్ధము జరుగుతున్న రోజులు.

భారతీయులు చాలా మంది సైనికులుగా డాక్టర్లుగా-ఇంజనీర్లుగా యుద్ధంలో చేరిపోయారు రెండు సంవత్సరాలపాటు వాళ్ళు ఎక్కడఉన్నా ఇళ్ళకు క్షేమ వార్తలు చేరుతూ ఉండేవి. ఆ తరువాత వాళ్ళను ఇటూ అటూ యుద్ధ స్థావరాలకు పంపటంవల్ల ఉత్తరాల సౌకర్యాలు అంతగా లేకపోయ్యాయి.

శేఖర్ డాక్టరుగా యుద్ధంలో చేరిపోయ్యాడు. అతడు అంతకు పూర్వమూ మిలటరీ డాక్టరు. సమయం రాగానే చేరిన వాళ్ళల్లో అతడు ప్రథముడు. లలితకూ అతడికీ పెళ్ళయి ఐదు సంవత్సారాలే అయింది. ఒక ఆడపిల్ల ఒక మగవాడు. వాళ్ళను విజయవాడలో తన తల్లి దగ్గర విడిచిపెట్టి వెళ్లాడు.

ఒక ఏడాది రెండేళ్లు లలిత వ్రాసిన జాబులకు జవాబు లొచ్చాయి. పిల్లలు పడుకున్న తరువాత దీపం వెలిగించుకొని ఆ ఉత్తరాలు చదువుకుంటూ ఉండేది. చదువుతూ చదువుతూ గుండెమీద వాటిని పెట్టుకుని కళ్ళు మూసేది. ఆ రోజు వచ్చిన ఉత్తరమే కాకుండా అంతకు పూర్వము వచ్చినవి కూడా మళ్ళీ మళ్ళీ చదువుకుని ఆ మధురస్మృతులతో కాలం గడిపేది. శేఖర్ డాక్టరే కాదు, మంచి సాహిత్యప్రియుడు. ఉపమాలంకారాలు లేకుండా మాట్లాడేవాడు కాదు అతడికి నోటికే ఎన్నో పద్యాలు వచ్చు. సోదాహరణంగా నవరసాలూ ఒలికిస్తూ ఎదటి మనిషిని ఉత్తేజపరుస్తూ ఉంటాడు.

“రోగులతో కూడా ఇలాగే మాట్లాడతారా ? పాపం వాళ్ళు బాధపడుతూ మందులకోసం వస్తే మీరు సాహిత్యం హాస్యం మాట్లాడితే ఎట్లా?” అంటుంది లలిత.

“నీవు దీనికే ఇట్లా అంటున్నావు. నేను ఆపరేషన్లు చేసేటప్పుడు థియేటర్లో కూడా పద్యాలూ పాటలూ పాడుతూంటే హుషారు వస్తుంది. అప్పుడు చురుకుగా పని చేస్తుంది నా మెదడు. రసం లేనిదే సాహిత్యంలేదు. సాహిత్యం లేనిదే మనిషి లేడు” నవ్వేసాడు శేఖర్.

“వీటితోనే రోగాలను నయం చేయరాదూ ? మళ్ళీ ఆ మందులూ కత్తులూ కోతలూ ఎందుకు ?” అంటుంది లలిత.

“నామ మాత్రంగా అయినా ఉండాలి” అంటాడు అతడు.

అటువంటి రసజ్ఞుడు రాసే ప్రణయలేఖలు ఎలా ఉంటాయో ఎంత ఉత్తేజంగా ఉండేవో ఆ లలితకే తెలుసు.

కొంతకాలం ఆ ఉత్తరాలను అటునుంచి వచ్చినవయినా ఇటునుంచి వెళ్ళిన వయినా సెన్సార్ చేస్తూ ఉండేది ప్రభుత్వము. ఆలస్యంగా చేరుతూ ఉండేవి. తన

దగ్గరున్న ఉత్తరాలను మననం చేసుకుంటూ రాత్రిళ్ళు నిద్రపట్టక ఇల్లంతాతిరుగుతూ వుండేది లలిత

అప్పటికి ఉత్తరం వచ్చి నెలరోజులయింది లలితకు. ఎందుకు ఆలస్య మైందో ఊహించలేకుండా ఉన్నది. యుద్ధములో చేరిపోయినవాళ్ళకు ఎన్ని రకాల ఏక్సిడెంట్లు కాగలవో అన్నిటినీ ఊహించుకొని గజగజ వణికిపోతున్నది లలిత.

"శేఖర్ ! ఈ వేళప్పుడు నీవు ఏం చేస్తుంటావో నేను ఊహించలేకుండా ఉన్నాను. నీవు వెళ్ళేటప్పుడు నా కళ్ళ వెలుగునూ ఒంట్లో ఉన్న ఉత్సాహాన్నీ మనసులో ఉన్న వికాసాన్నీ తీసుకుపోయావు. నేను యంత్రాలతో తయారుచేసిన బొమ్మలా తిని తిరుగుతున్నాను. ఇదంతా ఎందుకో తెలుసు ? నీ పిల్లలకోసం - నీ ప్రతిబింబాలకోసం. వాళ్ళల్లో నిన్ను చూసుకుంటూ-నీ ఛాయా చిత్రంతో మాట్లాడుతూ-తన ఏకైక పుత్రుడికోసం అహర్నిశలూ కన్నీరు కార్చే నీ తల్లికి నీవు తిరిగి వచ్చేవరకూ ధైర్యం చెప్పటంకోసం బ్రతుకుతున్నా,

నీ ప్రియమైన లల్లీ !"

వచ్చిన ఉత్తరాలన్నీ ఆ స్థావరంలో ఉన్నవాళ్ళు విప్పి చూశారు. వాటిలో మనసును కదిలించివేసే ఉత్తరాలను నోటీసు బోర్డుమీద పెట్టారు ఒక్కొక్కరు వస్తున్నారు - చదువుకుంటున్నారు-వెళ్ళుతున్నారు.

ఈ శేఖర్ ఎవరు ? అతడెక్కడున్నాడు ఇప్పుడు? అతని భార్య కాబోలు- ఎటువంటి ఉత్తరం వ్రాసింది ? ఎంత అదృష్టవంతుడా శేఖర్ !

"అయ్యో! నాకటువంటి అదృష్టం ఎక్కడది? ఎదురుగా ఉంటే మాట్లాడి. స్తారు. డబ్బు సంపాదించి ఇస్తే బాగా ఖర్చుచేసి జల్సాగా బ్రతుకుతారు" బరువుగా నిట్టూర్చి ఆ ఉత్తరం మరొకసారి చదువుకొని వెళ్ళిపోతున్నాడొక ఆంధ్ర వీరుడు.

ఎంత తెచ్చినా చాలదు చాలదు అనే కుటుంబాన్ని తలుచుకొని-పిల్ల పెళ్ళి నిశ్చయమైంది. కట్నం డబ్బులు సర్దు అంటూ పీడించే తల్లిదండ్రులను జ్ఞప్తికి తెచ్చుకొని అన్న పంపే డబ్బుతో రకరకాల డ్రెస్సులు కుట్టించుకుని జల్సాగా

చదువులు లేకుండా తిరిగే తమ్ముళ్ళనూ తలుచుకొని నిరాశా నిస్పృహలతో సైన్యంలో చేరిపోయిన రాఘవులు ఆ ఉత్తరం చూసి "ఒక్క రోజు బ్రతికినా చాలు అటువంటి భార్య ఉంటే" అనుకుని బరువుగా అడుగులు వేసుకుంటూ వెళ్ళాడు.

"నాకు ఆ భాషరాదు ఏమిటది ఉత్తరమా?" ఆపి పక్కనున్న వాడిని అడిగాడు ప్రతాప్‌సింగ్.

"అవును భాయి. అది ఉత్తరం. ఎవరో శేఖర్ అనేవాడికి వచ్చింది. భార్యో - లేక ప్రియురాలో ఉత్తరం వ్రాసింది" అన్నాడు తెలుగు భాష వచ్చిన సైనికుడు.

"అయితే భార్య ప్రియురాలు కాకుండదా?" అన్నాడు సింగు.

"కావచ్చు అయితే అదృష్టమే!"

"అయితే భాయీ! ఏమని రాసింది?" కుతూహలాన్ని పైకి కనబడకుండా అణచుకోలేకి పోయాడు.

ఆ ఉత్తరాన్ని హిందీలోకి అనువాదం చేసి వినిపించాడు తెలుగు సైనికుడు.

ఆ! ఆ! అంటూ పరవశించిపోయాడు ప్రతాప్‌సింగ్. పాపమతడు అదివరకూ విననైనాలేదు ప్రేమ లేఖలను గురించి.

ప్రతిరోజూ అక్కడ వుండే సైనికులందరూ ఉత్తరాలకోసం ఆ నోటీసు బోర్డు దగ్గరికి చేరుకునేవారు. బోర్డుమీద కొత్త ఉత్తరం లేకపోయేసరికి నిరాశతో మరలిపోయేవారు. కొత్త ఉత్తరంకోసం ఎదురుచూసేవారు.

వారానికల్లా కొత్త ఉత్తరం బోర్డుమీద పిన్నుచేసి ఉంచేశారు.

అందరూ గుంపులు గుంపులుగా మూగారు. అందరికంటేముందుచదవాలని ప్రతి ఒక్కరి ఆరాటం! ఈ గొడవంతా ఎందుకని ఒక సైనికుడు బిగ్గరగా చదివాడు

"శేఖర్! ఏ రోజు కారోజు యుద్ధ విరమణ అవుతుందేమో నీవు వస్తున్నానంటూ ఉత్తరం రాస్తావేమో ననుకుంటా. కాని అటువంటి శుభవార్తనా

కందటంలేదు. నా ఉత్తరాలు అందుతున్నాయా? మరి ఒక్కదానికయినా జవాబు రాయవేం? నీ కెప్పుడూ ని రోగుల గొడవ తప్పితే మా సంగతి ఆలోచించవా? నీ కంటే- యుద్ధ వార్తలో- ముందుకో వెనక్కో ప్రయాణాలు కట్టే సందడి- తోటి సైనికాధికారులతో జల్సా కులాసా కబుర్లు- అవీ యివీ నాకేముంది శేఖర్! కడుపులో గంపెడు దిగులు-పిల్లల కోసం- మీ అమ్మకోసం పైకి సంతోషంగా ఉన్నట్టు నటించటం-నీవు ఎప్పుడో రాసిన ఉత్తరాలు చదువుకొని అవిచ్చే ఆనందంతో బ్రతుకు వెళ్ళదీయటం- ఇంకెన్నాళ్ళు శేఖర్? నీవు వచ్చేవరకూ ఈ బ్రతుకును ఈడవగలనా?

నీ లల్లి"

విన్నవాళ్ళంతా అయ్యో! పాపం! ఇలా ఎంతమంది ఏడుస్తున్నారో? అందరికీ ఇలా ఉత్తరాలు రాయటంచేత కావద్దూ? ఇంతకూ, ఆ శేఖర్‌కు ఈ ఉత్తరాలు పంపుతున్నారా? వాళ్ళకు ఒకరి సంగతి ఒకరికి తెలియక ఎంత అలమటించి పోతున్నారో?

ఉన్నవాళ్ళు గుంపులు గుంపులుగా చేరుతున్నారు చెదిరి పోతున్నారు.

ఆకాశం దట్టంగా మబ్బు పట్టింది. గాలి దుమారం డేరాలను ఊపివేస్తున్నది. మేఘ గర్జనలకు గుండెలవిసి పోతున్నాయి.

ఉన్నట్టుండి అధికారులు గుసగుసలాడుకుంటున్నారు. స్టీమరులో సింగపూరుకు వెళ్ళిన దళాన్ని జపాను ప్రభుత్వం ఖైదీలుగా తమ దేశానికి తీసుకువెళ్ళినట్టు వార్త వచ్చిందని. ఈ వార్త ఎంతవరకూ నిజం? ఆ ప్రభుత్వం చేసే విష ప్రచారమా? లేక అంతటి దురవస్థ నిజంగా కలిగిందా? ఆ దళంలో డాక్టర్లూ, ఇంజనీయర్లూ ఇంకా అనేక మంది సైనికోద్యోగులు ఉన్నారు.

రేడియోలో ప్రసారమయిన వార్తలు ఆనోట ఆనోట అక్కడ అందరికీ తెలిసిపోయాయి.

ఆ రోజు ఒక నీలి కవరు వచ్చింది. దాని రంగు దానిపైన ఉన్న దస్తూరి చూసి చదువురాని సైనికుడు కూడా అది శేఖర్‌కు వచ్చిన ఉత్తరమేనని గ్రహించాడు. సైనికాధికారి ఆ కవరుపైన రాసిన పేరు చూసుకుని పెదవులు చప్పరించి——

తాను చదువుకున్నాడు. గుండె బరువెక్కినట్టుగా చేత్తో రాసుకుని ఆ కవరు నోటీసు బోర్డుకు పిన్ను చేసాడు.

"శేఖర్, నీ పేరు రాయాలన్నా నోటితో ఉచ్చరించాలన్నా గుండె కోతగా ఉంది. నీ కబుర్లేమీ తెలియటంలేదు. పిల్లలను చూసినా నీ తల్లిని చూసినా గుండె చెక్కలయిపోతున్నది. ఈ యంత్ర మొక్కటే మొండిగా తిరుగుతున్నది.

నీ పిలుపులతో మారుమ్రోగే మన గది మూగవోయింది. నీ వస్తువులు నన్ను వెక్కిరిస్తూ గుండెలు బ్రద్దలు చేస్తున్నాయి. నీ మంచం మీద నీ ఫొటో పెట్టాను. పూలహారాలు వేసుకుంటుంది గాని ఒక్కమాటయినా మాట్లాడదు. నాకు ధైర్యం చెప్పదు. కాని—ఆ చిరు మందహాసం చూస్తే నేనేమయిపోతున్నానో నీ కెట్లా చెప్పను? ఏమని రాయను? నేను గడుపుతున్నరోజు లెలా ఉన్నాయంటే నల్లరాతికి ఇనప గొలుసులతో కట్టేసిన మనిషి ఎట్లా నడుస్తుందో అట్లా ఉన్నాయి. రమణీయంగా- రసమయంగా- నన్ను ఉత్తేజపరచి రెక్కలు కట్టి నన్ను తనతో ఏదో లోకాలకు తీసుకువెళ్ళే నీవు లేవు

పదహారు కళలతో వెన్నెలలు విరిసేరోజు ఎప్పుడు వస్తుంది? నీ వెప్పుడు వస్తున్నావు? ఇవాళా? రేపా?—నీ లల్లి"

"అయ్యో! ఆమెకు ఈ సంగతి తెలియదేమో? ఎవరు తెలుపుతారు?

సైనికాధికారులు ఒకరి నొకరు కళ్ళతో ప్రశ్నించుకున్నారు.

అక్కడ ఉన్నవారెవరికీ ఆమెకు శేఖర్ సంగతి తెలిపే అధికారం లేదు.

అందరూ ఖిన్నులై తలలు వంచుకున్నారు.

ఆమెను ఉత్తరాలు రాసుకొనే భావోద్రేకమయినా ఇలా వెళ్ళబోసుకొనీ, త్వరలో అతడు తిరిగి వస్తాడనే ఆశతో ఆమెను జీవించనీ.

తలలు పంకిస్తూ బరువుగా నిట్టూర్చారు సైనికాధికారులు.

నాలుగు రోజులయినా గడవకముందే మరో ఉత్తరం వచ్చింది.

"శేఖర్ చూశావా? మనను చూసి లోకం ఓర్వలేకపోతున్నది కళ్ళల్లో నిప్పులు పోసుకుంటున్నది. నీవుట-ఖైదీగా పట్టుబడ్డావట! మీ చిన్నాయనగారి

అల్లుడు పనికట్టుకుని వచ్చి చెప్పివెళ్లాడు. పట్టి కుళ్ళు మనిషి "మీ ఆయన ఎంత డబ్బు పంపించాడు?" అని అడిగాడు.

నా బ్రతుకు ఎట్లా ఉందనుకున్నావు శేఖర్! అందరూ నన్ను చూసి "పాపం" అనుకుంటున్నారు. ఏమిటో గుసగుసలాడుకుంటున్నారు. పిల్లలకు ఒక్కొక్కళ్ళే వచ్చి పళ్లూ, మిఠాయిలూ యిచ్చి జాలిపడుతున్నారు. శేఖర్! నా గుండె పగిలిపోతున్నది. నీవు వచ్చి ఈ పరిస్థితులను చక్కదిద్దవా?

ఎదురు చూసి చూసి అలసిపోతున్నా శేఖర్.

నీ లల్లీ!

ఇలాగే ధైర్యంతో రాసిన ఉత్తరాలెన్నో నోటీసుబోర్డు కెక్కుతున్నాయి. పాతవి తీసేసి కొత్తవి పెడుతున్నారు సైనికాధికారులు.

కొన్ని నెలలయిన తరువాత ప్రభుత్వం రేడియోలో కుటుంబాలవద్ద నుండి వచ్చిన క్షేమసమాచారాలు సైనికులకు ప్రసారము చేయటం మొదలుపెట్టింది.

"రామన్! నీ భార్య ఇందిర, కొడుకు వెంకట్, కూతురు మంజరి అంతా క్షేమంగా ఉన్నారు."

"సూర్యప్రకాష్! నీ కుటుంబమంతా క్షేమంగా ఉన్నారు."

"అంతయ్యా! నీ ముసలి తల్లిదండ్రులు క్షేమంగా ఉన్నారు."

ఈ రేడియో వార్తలు వినటానికి లలిత రాత్రింబగళ్ళు దాని ముందర కూర్చునేది. తాను రేడియో ముందునుంచి కదిలితే శేఖరు దగ్గర్నుండి వచ్చే వార్తలు తను వినలేకపోతానేమో నని భయపడుతూ అక్కడే కూర్చునేది.

వారంరోజులు విన్న తరువాత ఆమె అర్థం చేసుకున్నది ఇవన్నీ ఇళ్ళ దగ్గర్నుండి వెళ్ళే వార్తలేగాని అక్కడి నుంచి రావటం లేదని.

"శేఖర్! ఏమిటీ దారుణం? నా వార్తలు నీకు తెలుస్తున్నాయా? ఎటువంటి పరిస్థితులలోనూ నీవు నాకు రాయకుండా ఉండవని తెలుసు. నీకేదో ఆపద వచ్చిందని నా మనసు గట్టిగా చెబుతోంది. చాలా ఆందోళనగా ఉంది. మన ఇద్దరి

మధ్య ఇదివరకూ నీవు కట్టిన తాళి మాత్రమే అడ్డుగా ఉండేది. ఇప్పుడో? దాటరాని నదులూ, దూరరాని అడవులూ ఉన్నాయి. నేనేం చెయ్యను? నాకేది దారి?

అసలు సైన్యంలో ఎందుకు చేరావు శేఖర్? డబ్బు కోసం చేరావా? ఉన్నదానితో తృప్తిపడే నన్ను అపార్థం చేసుకున్నావా? నేనటువంటి దాన్ని కానని నీకెట్లా చెప్పను? నా మనసంతా ముక్కచెక్కలయిపోతోంది శేఖర్! నీవు నన్ను పరీక్ష చేయటం లేదు కదా!—నీ లల్లీ".

పదిహేను రోజుల తరువాత ఊళ్ళో పుకారు బయలుదేరింది. సైనికులెవరో పారిపోయి వచ్చారనీ- వాళ్ళను పట్టుకోవటానికి కొందరు అధికారులు ఇల్లిల్లూ సోదా చేస్తున్నారనీను.

గజగజలాడిపోయింది లలిత. ఆ జీవితం విసుగొచ్చి పారిపోయి వచ్చాడేమో! తనను చూడాలని కొండంత ఆశతో వస్తే—ఇల్లు చేరకముందే సైనికాధికారులకు పట్టుబడతాడేమో? ఇంకేముంది? తన శేఖర్‌ను కాల్చివేస్తారు.

కాని- మళ్ళీ అనుకుంది- తన శేఖర్‌కు ఏ కర్మం పట్టింది చెప్పకుండా పారిపోవటానికి? ఇదంతా తన శేఖర్‌ను గురించి కానేకాదని గట్టి ధైర్యం తెచ్చుకుంది.

"అబ్బబ్బ! శేఖర్! చేత్తో ఒక్క ఉత్తరం ముక్క రాయవుగాని ప్రతి రోజూ కలలోకి వచ్చి నన్ను ప్రలోభ పెడతావా? ఏమిటా చిలిపితనం? నీకొంటె చేష్టలు అక్కడున్నా మానలేదన్న మాట. సరేలే. నీ చిలిపి తనం మాని వారం రోజులు సెలవు తీసుకునిరా, నీ పిల్లలను కళ్ళతో చూద్దువుగాని-ఎంత ఎదిగారో! మీ అమ్మను పలకరించి గుండెచల్లపరచు. వస్తావుగా. నీ కోసం ఎదురుచూసేలల్లీ."

డాక్టరు పరమేశం ఆ ఉత్తరాలన్నీ చదువుకొని నోటీసు బోర్డు మీది నుంచి తీసి కిందపడేసిన వాటిని ఏరుకుని జేబులో కుక్కుకునేవాడు. ఎవరూ చూడకుండా కళ్ళు తడుచుకునే వాడు.

డాక్టరు పరమేశం చెప్పటం అయిందన్నట్లు మరో జరదా బీడాను నోట్లో పెట్టుకుని సిగరెట్టు ముట్టించాడు.

"అయితే పరమేశం! ఆ శేఖర్‌వి నీవు కాదు గదా?" అన్నారు నరహరేశ్వరావూ ఒక్కసారే.

"అయితే ఎంత బాగుండేది? కాదు కనుకనే నా కింతబాధ" కణతలు రుద్దుకున్నాడు పరమేశం.

"అది కూడా చెప్పు? ఇవాళ ఎవరికీ రహస్యాలుండకూడదని ప్రమాణాలు తీసుకున్నాంగా మొదట్లో."

ఆ లలితా నేను మొదట్లో ప్రేమించుకున్నాం. లలిత కాస్త నలుపు అయినా కళగల ముఖం. విశాల నేత్రాలు, కోమలమయిన తనువల్లరి. కాని మా అమ్మ కోడలు నలుపయితే కులమంతా నలుపవుతుందనిపట్టుపట్టింది. బావిలో దూకుతానని బెదిరించింది. ఏం చెయ్యను? ఏక పుత్రుణ్ణి మనసు తిప్పుకుని ఆమె చూపించిన పిల్లను పెళ్ళి చేసుకున్నాను. వచ్చిన ఆమె డబ్బుమనిషి డబ్బా కాదు హోదా కావాలి కాని నేను పనికిరాను.

లలిత హృదయం నాకు తెలుసు. ప్రేమమయి. నాకు కాకుండాపోయింది నా హృదయంలో పీఠం వేసుకుని కూర్చున్న లలిత నన్ను అప్పుడప్పుడు కలలలో పలకరించేది. ఆ ఉత్తరాలలో శేఖర్ పేరు తీసేసి నా పేరు రాసుకుని తన్మయుడనయ్యేవాడిని."

"శేఖర్ తిరిగి వచ్చాడా?" జడ్జి శివరావు గొణిగాడు.

"వచ్చాడు. యుద్ధానంతరం ప్రభుత్వాల మధ్య ఖైదీల మార్పిడి జరిగింది గుర్తుపట్టలేని స్థితిలో వచ్చాడు. లలిత కంటిపాపలా కాపాడి ఆరోగ్యవంతుడిని చేసుకుని ఇంటికి తీసుకు వెళ్ళింది.

"మంచి పనేగా! అందుకు మనమంతా సంతోషించాలి. అంతేనా?"

శివరావూ నరహరీ నవ్వారు. కళ్ళల్లో నీటిపొర తేలి ఆడుతుండగా పరమేశం కూడా నవ్వాడు.

పన్నెండు గంటలు కావచ్చింది. ముగ్గురూ వెన్నెల స్నానాలు చేసినట్టున్నారు.

"నరహరీ. ఇంక ఇవాల్టికి ఇళ్ళకు వెళ్దాం లేవండి. ఇంత పొద్దుపోయేవరకూ మేలుకుంటే మన ఆరోగ్యాలు చెడిపోతాయి" అంటూ లేచాడు శివరావు.

"ఓహో! మేము చెప్పేవవి విని- నీవు చెప్పకుండా ఇంటికి వెళ్ళాలనా నీ ఉద్దేశ్యం? అదంతా కుదరదు. చెప్పి తీరాల్సిందే ఎంత పొద్దుపోయినా" బల వంతంగా శివరావును కూర్చోబెట్టాడు పరమేశం.

అది మదరాసులోని తాంబ్రమం టి. బి. శానిటోరియం. వేణు సంవత్సరాల నుండీ అక్కడ ఉంటున్నాడు. ఆ శానిటోరియమ్‌లో చేర్పించిన నాడు అతడికి ఊపిరి తిత్తులనిండా చిల్లులు. ఎముకల గూడులా నోటమాట రాకుండ ఉన్నాడు.

లేతనీలం రంగు బల్బు వెలుగులో మంచంమీద కిటికీకి దగ్గరగా పడుకు న్నాడు.

''వేణూ! పడుకోలేదూ! గంట పన్నెండు. అన్నాడు తండ్రి రంగారావు.

''నిద్ర పట్టడం లేదు నాన్నా!''

మనసులో దిగులు పెట్టుకోకురా. ఇంకా నాలుగయిదు నెలల్లో ఇంటికి వెళ్ళిపోతాము. హాయిగా నీ ఉద్యోగం నీవు చేసుకుందువు గాని. దీపిక పిల్లలతో వస్తుంది. అమ్మను కూడ నీ దగ్గర కొంతకాలం అట్టిపెట్టుకో, మనం అందరి కంటే అదృష్ట వంతులమని డాక్టరుగారు చెబుతున్నారు. ఆ నరసయ్యను చూశావా? ఐదేళ్ళనుంచీ ఉన్నాడట. తగ్గుతున్నట్టే తగ్గి మళ్ళీ హెచ్చుతోందట. జబ్బు. ఆ హాల్లో అన్ని మంచాలమధ్య తీసుకుంటున్నాడు. నీకేం? హాయిగా స్పెషల్ రూము తీసుకున్నాము. డాక్టరు మనవాడే కనుక కొత్తగా వచ్చిన మందులు వాడుతున్నాడు. ఇప్పుడు నీ బరువు ఎక్కింది. ముఖం మిసమిస లాడుతున్నది. దిగులు పెట్టుకో కుండా దేవుణ్ణి తలుచుకో. రంగారావు పక్కమీద లేచి కూర్చున్నాడు.

"నాకేం దిగులు నాన్నా? నేను హాయిగా ఇక్కడున్నాను. మీరే నా కోసం అష్టకష్టాలూ పడుతున్నారు. అమ్మా పిల్లలూ ఒకచోట - దీపా పిల్లలు ఒకచోట. డాక్టరుగారు ఇంతకాలం ఉండాలని మొదట చెప్పలేదా నాన్నా?'' అదొక మాదిరిగా ఒణుకుతున్న కంఠంతో అడిగాడు వేణు.

''అబ్బే, ఆయన మొదటే చెబితే అమ్మను కాకపోయినా దీపా పిల్లనయినా తీసుకువచ్చి ఇక్కడ కాపరం పెట్టనూ? ఎప్పుడడిగినా నేనే చెబుతాను. ఆగండి'' అంటారు ఇంక మొక్క విడమరచి చెప్పారు - ఇంకా నాలుగైదు నెలల్లో పంపిం చేస్తామని.

"అమ్మ ఉత్తరాలు రాస్తున్నదా నాన్నా?"

"రాస్తునే ఉన్నదిరా. పిల్లలూ వాళ్ళ చదువులూ - ఇంటి వార్తలూ ఏదో రాస్తూ ఉంటుంది వారానికోసారి." రంగారావు వేణు ముఖంలోకి చూశాడు, దీపిక సంగతి అడుగు తాడేమోనని.

వేణు మాట్లాడలేదు. దిండు క్రింది ఉన్న సిల్కు రుమాలును తడిమి చూసుకున్నాడు. సిల్కు రుమాలులో బంధింపబడిన కాగితాల మడతాల చేతికి తగలగానే అతడి ముఖం వికసించినట్టుగా కనబడింది రంగారావుకు. ఆయనకు ఆశ్చర్యం కలిగింది. ఈ రెండేళ్ళ నుంచి వేణు దీప ముఖం చూడలేదు ఒక్క నాడయినా ఆమె సంగతి అడగలేదు. కనీసం యెక్కడున్నదనయినా ప్రశ్నించలేదు.

బరువుగా నిట్టూర్చి రంగారావు పక్క మీద ఒరిగాడు. అవలింతలు వచ్చాయి. కళ్లు మూసుకున్నాడు.

ఉదయం లేవగానే రంగారావు తను ముఖం కడుక్కుని వేణుకోసం వేడి నీళ్ళు తెచ్చి బల్లమీద పెట్టాడు. బ్రెష్ పేస్టు ఎదురుగా పెట్టి పాలు టిఫిన్ కోసం వెళ్లాడు.

రంగారావు హాస్పిటల్‌కు రెండు వందల గజాల దూరంలో ఒక చిన్న ఇల్లు తీసుకున్నాడు. వెళ్ళిన అరగంటలోనే ఉడకబెట్టిన కోడి గుడ్లు రెండు పెద్ద గ్లాసెడు కాచిన పాలు కాల్చిన బ్రెడ్ స్లైస్‌ని తీసుకువచ్చాడు. వచ్చేటప్పుడు తను గ్లాసెడు కాఫీ తాగి వచ్చాడు.

తండ్రిని చూడగానే వేణు లేచి కూర్చుని పాలు గుడ్లు తీసుకున్నాడు. బ్రెడ్ స్లైస్‌ని చేతిలోకి తీసుకుని చాకుతో వెన్న రాస్తూ "వేణూ పేపర్ కొనుక్కొస్తాను. కొంచెం దూరంగా వెళ్ళాలిరా" అంటూ ఉత్తరీయం భుజాన వేసుకుని బయలు దేరాడు రంగారావు.

"తొందరేమున్నది నాన్నా? పేపరు తీసుకుని ఏకంగా నీవు భోజనం చేసి నాకూడా తీసుకురా. ఆత్రపడకు. ఎన్నిసార్లని తిరుగుతావు?" అన్నాడు వేణు.

రంగారావు గది దాటగానే వేణు "అమ్మయ్య" అంటూ ఊపిరి పీల్చు కున్నాడు. తండ్రి మరో మూడు గంటలకుగాని రాడు దిగ్గునలేచి కూర్చుని దిండు

కిందవున్న సిల్కు రుమాలుతీసి విప్పాడు. లేత నీలంరంగు కాగితపు మడతలు కొన్ని మొగలిపూవు వాసనలు వెదజల్లుతూ ప్రాణం వచ్చినట్టు కదిలాయి.

వాటిని చూసి వేణు తన్మయుడై పోయాడు. కాగితపు మతడను వాసన చూసి సుతారంగా మడత విప్పాడు.

"వేణూ! మీరేమో "నాకంటి దీపానివి దీపా!" అంటారు. కాని-నేను మీ అంతాన్ని చూసే రాక్షసిని. ప్రబల శత్రువును. కాక పోతే-మిమ్మల్ని ఇంత దూరాన హాస్పిటల్లో చేర్పించి వైద్యం చేయించే మీ తల్లిదండ్రులు నాతో ఒక్క మాటయినా చెప్పకుండా ఈ ఊరు తీసుకువస్తారా? నేను మిమ్మల్ని కర కర నమిలి తినే కామినీ పిశాచిని కాబోలు? నా మనసు - నా ప్రవర్తన - మీ పట్ల నా ఆరాధన ఇటువంటి అపార్థాన్ని ఎలా కల్పించాయి?

నాకు తెలుసు వేణూ-జరిగిన దానిలో మీ ప్రసక్తిలేదు. మీ కళ్ళు కప్పారు. నన్ను నా వేణుకు దూరంచేశారు.

మీకు వచ్చినది తీవ్రమైన వ్యాధని నాకూ తెలుసు. మంచి వైద్యోపచారాలు అవసరమని నాకూ తెలుసు? అంత గ్రహింపు శక్తి నాలో లేదా?

నాలో ఎంత ప్రేమ ఉందో అంతటి త్యాగమున్నది. అంతటి సేవా భావమున్నది.

నేనెంత దురదృష్టవంతురాలిని? మీ తల్లిదండ్రులు నా మనసు తెలుసు కోకుండా ప్రవర్తిస్తున్నారే!

పోని లెండి. మీకు నా మనసు తెలిస్తే చాలు. నాకదే పదివేలు.

కాని-ఈ కష్ట సమయములో నేను మీ దగ్గర ఉండి మీకు బాధోపశమనం అయేటట్టు—మనసుకు ఊరట కలిగేటట్లు కబుర్లు చెబుతూ నా చేత్తో మందులిస్తూ-మీ సమక్షంలో నేను ధైర్యం తెచ్చుకోవాలనుకుంటే—నాకా భాగ్యము కలిగేటట్టు లేదు.

మీరు మీ తండ్రిని ఒప్పించరూ? పిల్లలను మా అమ్మదగ్గర వదలిపెట్టి-ఒక్క దాన్నీ వచ్చేస్తాను. జబ్బులో ఉన్నా మీ చిరునవ్వు చూస్తూ నే నెంతపన యినా చెయ్యగలను. మీ శుశ్రూష కోసం రాత్రింబగళ్లు మేలుకొని ఉంటాను.

మీ నాన్నగారికీ మీ అమ్మగారికీ ఒక్కమాట చెప్పండి. నన్ను కూడా తీసుకురమ్మని.

మీ దీప."

వేణు ఆ ఉత్తరాన్ని మడతచేస్తూ వేడి కన్నీటిబొట్లు రాల్చాడు. బాధకొద్దీ తల పట్టుకున్నాడు.

అమ్మ! నాన్న! వాళ్ళకు వాళ్ళ కొడుకును గురించిన విచారమేగాని- కొడుకు మనసులో ఏముందో గ్రహించరు దీపా! నేను నిస్సహాయుడను.. కేవలము నిస్సహాయుడను. నీ సంగతి వాళ్ళతో చెప్పలేని పిరికివాడిని. పది నిమిషాల సేపు దిండ్లకు ఒరిగి కళ్ళు మూసుకున్నాడు వేణు.

అంతలో దిగ్గున లేచి కళ్లు తెరిచాడు. నాన్న వచ్చేస్తాడు. దీప వ్రాసిన ఉత్తరాలయినా చదువుకుంటేగాని మనశ్శాంతి రాదు అనుకుంటూ మరొక ఉత్తరం తీశాడు.

"నా ప్రాణంలో ప్రాణమయిన వేణూ! మనం ప్రేమించి పెళ్ళి చేసుకున్నామా? లేదా? పెద్దలు చేసిన పెళ్ళే. మన కలయికవారామోదించినదే! కాని, మనం అందరిలాగ లేకుండా అపురూపానురాగంతో దాంపత్య జీవితమారంభించాం. రాగ మెరుగని లాలనతో జీవితమారంభించాం. వాడని పుష్పంలా దాన్ని పోషణ చేస్తున్నాం. వయసుతో నిమిత్తం లేకుండా పెంచుతున్నాం. వేణూ! సామాన్యుల దృష్టికి ఇది సాధారణమైనదే. అపూర్వమూ అసాధారణమూ అయిన మన అనురాగాన్ని అందరూ గుర్తించలేరు. నా నుండి నిన్ను దూరం చేస్తే మన అనురాగలత వాడుతుందా? భ్రమగాని!

"దీపను ఇక్కడికి తీసుకువస్తే వచ్చే నష్టమేమిటి? ఖర్చుకోసమా? కాదు నాన్నకూ అమ్మకూ డబ్బు ఖర్చవుతుందన్న భయంలేదు. ఎలాగయినా తమ కుమారుడు ఆరోగ్యం బాగుపడటమే వారికి కావలసింది. ఎందుకు? ఎందుకు దీపను నా నుండి దూరం చేస్తున్నారు? ఆ పసి వాళ్ళకు తండ్రిని చూడాలని ఉండదా? వాళ్ళని చూడాలని నాకు ఉండదా? అమ్మా! నీ వయినానన్నర్థం చేసుకోవమా. దీపను మీ కుమార్తెను చూసినట్టు చూసుకోండమ్మా" సగం పైకి సగం లోపలా గొణుక్కున్నాడు వేణు.

యాంత్రికంగా మరొకటి తీసి మడత విప్పాడు.

"స్వామీ ! నా కర్థమయింది. మీ నాన్నగారి మనసులో ఉన్నమాట. నన్ను తీసుకు వెళ్ళమని నేను ప్రాధేయపడితే ఛీత్కారం చేస్తూ మనసులో ఉన్నదాన్ని వెళ్ళగ్రక్కారు. రెండేళ్ళ క్రిందటే ఈ వ్యాధి పొడచూపిందట. వైద్యంచేయించి జాగ్రత్తగా ఉండరా అబ్బాయి, అని చెప్పారటమీతో. కాని ఏడాది లోపలే ఉమ పుట్టింది. ఆ కారణంచేతనే ఈ వ్యాధి తిరగబెట్టిందనీ ఇప్పుడు ప్రాణం మీదికి వచ్చిందని దీనికంతకు నేనే కారణమని నన్ను తిట్టిపోశారు. మీరు తిరిగి ఆరోగ్యంగా ఇంటికి వచ్చేవరకూ మీరు నా కంటపడకూడదని శాసించారు. మీమీద ఒట్టు వేయించుకున్నారు. నాకెంత కఠినమయిన శిక్ష పడ్డదో చూశారా ? నేనెట్లా భరించను; మీ కోసం పిల్లలు అలమటించిపోతున్నారు. ఒక్కసారి దూరాన్నించి మిమ్మల్ని చూపించేవరకూ ఊరుకునేటట్టులేరు. కాని-వాళ్ళ మొర నా మొర ఎవరు ఆలకిస్తారు ?

వేణూ ! నా బాధలో నేను ఒక పెద్ద పొరబాటు చేస్తున్నాను. నా సొదంతా వ్రాసి మీ మనసును కలవరపెడుతున్నానేమో ! మీ మనసు ఇప్పుడు ప్రశాంతంగా ఉండాలి. అలా ఉంటే త్వరగా కోలుకుంటారు. నా అదృష్టం బాగుంటే మీ నాన్న నన్ను చూడనిస్తారు. సరే. ఆ రోజుకొరకే ఎదురు చూస్తూ ఉంటా.

"మీ దీప"

వేణు ఉత్తరమంతా మరొకసారి చదివాడు. అక్కడక్కడ కళ్ళనీళ్ళు పడి కాటోలు-అక్షరాలు అలుక్కుపోయాయి. అతడి గుండె ఒకసారి గుబగుబలాడి నట్లయింది.

తన తల్లిదండ్రులు తనను అనవలసిన మాటలు దీపను అంటున్నారు. తనకు విధించవలసిన శిక్షను దీపకు విధిస్తున్నారు తప్పుచేసిన కుమారుడు వారి దృష్టిలో మంచివాడే. ఎటొచ్చీ-కోడలే అలుసు. బాధతో మనసు మూలిగింది.

అనుకోకుండా ఆనాడు గడియారం చూసుకున్నాడు. తండ్రి వచ్చే వేళ సమీపించింది. తనెంత అవివేకి ? దీప వ్రాసిన ఉత్తరాలు చదువుకొని మనసుకు ఊరట కల్గించుకోదలచుకుని-ఆలోచనలో పడ్డాడు. తనకే ఇట్లా ఉంటే దీపక్కు ఎట్లా ఉంటుంది ?

గ్లాసులో ఉన్న నీళ్ళలో బట్ట తడిపి ముఖమంతా తుడుచుకున్నాడు రెండు చేతులతో క్రాపు సవరించుకున్నాడు యధాప్రకారంగా పక్కమీద పడుకుని ఉత్తరాలన్నీ మడిచి సిల్కు రుమాలులో కట్టి తలగడ క్రింద భద్రపరుచుకున్నాడు.

తనకు ఈ హాస్పిటల్ నుండి విడుదల ఎప్పుడో? తన ఉద్యోగానికి దీర్ఘ కాలం సెలవు పెట్టించాడు తండ్రి.

కళ్ళు మూసుకున్నాడు కాని ఆలోచనలు సాగిపోతూనే ఉన్నాయి.

అడుగుల చప్పుడు వినబడుతున్నది.

కళ్లు మూసుకునే ఉన్నాడు వేణు.

తండ్రి లోపలికి వచ్చాడు. టిఫిన్ కారియరు బల్లమీద పెట్టి పళ్ళెం తుడిచి తీసుకువచ్చాడు. గ్లాసుతో మంచినీళ్లు పెడుతూ వేణూ! లేచి భోజనం చెయ్యి. ఇవాళ వంకాయ కూర, అల్లం పచ్చడి మూలక్కాడ పులుసు. అంటూ పళ్ళెంలో పదార్థాలన్నీ వడ్డించాడు.

వేణు పరధ్యానంతో లేచి కూర్చుని అన్నం తినటం మొదలుపెట్టాడు.

"వేణూ! నేను వెళ్ళిన తరువాత నర్సు లెవరైనా వచ్చారా మళ్ళీ? టెంప రేచరు చూశారా?" అడిగాడు. ఎదురుగా కుర్చీలో కూర్చుని.

రాలేదని తలవంచుకుని చెప్పాడు.

"నీవు ఏదో ఆలోచిస్తూ ఉంటా వెందుకురా ఎప్పుడూ? మరీ ఇవాళ నీ ముఖం అదోలా ఉంది" అన్నాడు రంగారావు.

వేణు వంకాయ కూర కలుపుకుని ఒకముద్ద నోట్లో పెట్టుకున్నాడు. ఆ కూర! ఆ రుచి! ఈ ఊళ్ళో వంకాయ కూర ఈ విధంగా ఎవరు చేశారు? ఈ రుచులను మరచి ఎంత కాలమయింది? దీప ఒక్కతే చేయగలదు ఇటువంటి కూర. ఏమేమివేసి వండుతుందో - ఆచేత్తో ఏమీచేసినా అమృతం - అమృతమే.

ఎంతో ఆప్యాయంగా ఏమేమిటో జ్ఞప్తికి తెచ్చుకుంటూ ఆ వంటకాలు అయి పోతాయేమోనన్నట్లుగా కాస్త కాస్త కలుపుకుని - మధ్యమధ్య ఆలోచిస్తూ భోజనం చేస్తున్నాడు వేణు.

ఆలోచనలు ఇటూ అటూ పోతున్నట్టుగా కొడుకుముఖం చూసి కనిపెట్టాడు రంగారావు.

"మనం అద్దెకు తీసుకున్న ఇంటి పక్కవాటాలో తెలుగు వాళ్ళున్నారురా. నీవిట్లా హాస్పిటల్లో ఉన్నావనగానే బామ్మగారిలాంటి ఆవిడ "నేను రుచిగా చేసి పెడతాను. అబ్బాయికి తీసుకువెళ్ళండి" అన్నది. ఏమన్నా నీకు హితవుగా ఉన్నాయా?" ఆప్యాయంగా అడిగాడు రంగారావు.

తల ఊపాడు వేణు బాగున్నా యన్నట్టుగా.

మరునాడు రంగారావు ఇంటికి వెళ్ళగానే పోస్టులో వేణుకు ఉత్తరం వచ్చింది.

"వేణూ! నిన్న నేను బాధ భరించలేక మీఅమ్మ కాళ్ళమీద పడిపోయాను. ఎలాగయినా మీ దగ్గరికి పంపించమని. మొదటి కోప్పడ్డారు. తర్వాత నా నుంచే ఇదంతా వచ్చిందని నిందించారు. తిట్టారు! చివరకు నా కన్నీళ్ళు చూడలేక మీ తమ్ముడు సుందర్‌ను నన్ను మీరున్న ఊరు పంపటానికి నిశ్చయ చేసుకున్నారు. నా మనసు ఎంత గంతులువేసిందని! ఇంక మీ దగ్గర ఉండవచ్చు. రాత్రింబగళ్లూ కంటికి రెప్పలా కాపాడవచ్చు. మీ బాధలన్నీ పోయేటట్టు తీయతీయటి కబుర్లు చెప్పవచ్చు నా చేతులన్నీ అరిగేటట్టు శుశ్రూష చేయవచ్చు. ఎంతయినా కంటి కెదురుగా ఉంటాను గనుక నా కెన్నాళ్ళనుంచో ఉన్న బాధ, గుండెను తొలిచివేసే బాధ, ఇంక ఉండదనుకుంటే ఎంతో సంతోషంగా ఉంది.

కాని—ఇదేమిటి—ఎన్ని గంటలయినా రాత్రి గడవదు? ప్రయాణమయి మనం చేరువవుతామనుకున్న దగ్గర్నుంచీ మనసు ఊరికే పరుగులు తీస్తున్నది. వచ్చిన తరువాత అన్ని కబుర్లు సమక్షంలో చెప్తాగా.

—మీ దీప."

దీప వస్తుందనుకోగానే వేణుకు వేయి ఏనుగులబలము వచ్చినట్లనిపించింది. దీప వస్తే వంటచేసి తీసుకువస్తుంది. తన చేతి వంట! ఆ రుచులతో హాయిగా తను ఆప్యాయంగా కబుర్లు చెబుతూ ఉంటే ఎంత హాయిగా ఉంటుంది! పగలంతా ఇక్కడే ఆమెతో కులాసాగా కబుర్లు చెప్పుకోవచ్చు. ఏదయినా మంచి పుస్తకం-

వారపత్రిక ఆమెచేత చదివించుకోవచ్చు. అసలు దీప వచ్చేస్తే ఏ సమస్యా ఉండదు. అన్నీ ఆమె చూసుకుంటుంది. ఈ నావకు ఆమె చుక్కాని.

కళ్ళు మూసుకుని తీయటి ఆలోచనలు చేస్తూ మధ్య మధ్య చిరునవ్వులు చిందిస్తూ-భ్రూకుటి ముడుస్తూ దీపరాగానే కాలం ఎట్లా గడపాలా అని పథకాలు వేస్తున్న వేణుకు "ఏం రా! నిద్రలో ఉన్నావా? మేలుకునే వున్నావా? లే. లే. టిఫిన్ కారియరు తెచ్చాను'' అంటూ తండ్రి లోపలికి వస్తూ అన్న మాటలూ నవ్వు వినబడ్డాది.

వేణు లేచి కూర్చున్నాడు. రంగారావు టిఫిన్ కారియరు బల్లమీదపెట్టి మంచినీళ్ల పోసిన గ్లాసు పళ్ళెం దగ్గరగా జరిపాడు. టిఫిన్ క్యారియరులో వున్న పదార్థాలు పళ్ళెంలో వడ్డించి అన్నం పెట్టాడు.

వేణు భోజనం చేస్తూ ఆలోచిస్తున్నాడు. ఇంత రుచిగా వంటచేసి పెట్టే బామ్మగారు నాన్నకు ఇరుగు పొరుగులా లభించటం ఎంతో అదృష్టం. పాపం, బామ్మగారి కాలంలో స్త్రీలకు తమ తెలివితేటలూ-ఆలోచనా శక్తి పరిశోధన అంతా వంటకాలలోనేగా! అదే ఆమె మంచి యిల్లాలని ముద్ర పడటానికి ఆధారము. వేణు ఒక నవ్వు- విషాదభరితమయిన నవ్వు నవ్వుకుని ఇప్పటికీ కొందరు అంతే కాని-దీప సంగీతం-నాట్యం చిత్రకళ-పాకకళ మొదలైన వాటిలో యోగ్యతా పత్రాలుగల ఉత్తమ ఇల్లాలు.

వేణు ముఖం ప్రఫుల్లమయింది.

వేణు భోజనం కాగానే రంగారావు బల్లమీద పడుకుని పేపరు చదువుతూ నిద్రపోయాడు. వేణు ఏలకపండు ఒకటి ఒలిచి నోట్లో వేసుకుంటూ దీప వస్తానని వ్రాసిన ఉత్తరం ఎప్పటిది అనుకుంటూ ఉత్తరం మడత విప్పాడు.

పదిరోజులనాడు వ్రాసిన ఉత్తరమది. ఎందుకింత ఆలస్యం?

ఉత్తరం పైన ఉన్న పోస్టల్ ముద్ర- పరిశీగా చూశాడు. ఉత్తరం రాసిన వారానికి పోస్టు చేసింది.

రాసిన తరువాత వెంటనే పోస్టు చెయ్యలేదా?

బయలు దేరుతున్నానని సంతోషంతో వ్రాసిన ఉత్తరం పోస్టు చేయటానికి ఆలస్యం జరిగిందంటే ప్రయాణం ఆగిపోయే సూచనలో - సంఘటనలో ఇంట్లో జరిగి ఉండాలి. అమ్మ ఒప్పుకున్నా నాన్న ఆమోద ముద్ర పడితేనే గదా దీప ప్రయాణం సాగేది?

నిరాశా నిస్పృహలు అతడిని చుట్టుముట్టాయి. ఉత్సాహం నీళ్లుగారి పోగానే అతడి శక్తంతా ఉడిగినట్లయిపోయింది.

సాయంకాలం నాలుగు గంటలుకాగానే తండ్రి అందించిన బ్రెడ్ కాఫీ తీసుకున్నాడు. ముభావంగా పక్కకు తిరిగి పడుకున్నాడు.

రాత్రి ఏడున్నర గంటలకు తండ్రి మళ్ళీ టిఫిన్ కారియరు తీసుకువచ్చాడు. బంగాళా దుంప వేపుడు, నాలుగు అప్పడాలు.

''నాన్నా! నీవు భోజనం చేశావా?'' అన్య మనస్కుడిలా ఎటో చూస్తూ అడిగాడు.

"ఆఁ నేను రోజూ నీకు తీసుకువచ్చేటప్పుడే భోజనంచేసి వస్తాను. ఇక్కడి నుంచి మళ్ళీ వెళ్ళటం రావటం వృథాశ్రమ'' పక్క దులిపి వేసుకుంటూ "వేణూ! చెప్పం మరిచాను. ఇవాళ మెయిలులో సుందర్ వచ్చాడు. అమ్మ ఏదో బజారు పనులు చెప్పిందట. అందుకని అలా బజారుకేసి వెళ్ళాడు'' అన్నాడు.

''అయితే అమ్మ కూడా వచ్చిందా?''

''అమ్మ రాలేదు''

''సుందర్ ఒక్కడే వచ్చాడా?''

''ఆఁ. ఆఁ. అంతే. ఒక్కడే వచ్చాడు.''

దీర్ఘమైన నిట్టూర్పు ఒకటి అనుకోకుండా విడిచాడు వేణు.

యథాప్రకారం నాలుగు గంటలకు తండ్రి కాఫీ బ్రెడ్ ఇచ్చి ఇంటికి వెళ్ళాడు.

వేణు ఆలోచనలు మళ్ళీ ముసురుకుంటున్నాయి. ఉత్తరం రాసిన దీప ఇంకారాలేదు రాకపోయినా ఉత్తరం రాయొచ్చుగా?

నర్సు మామూలు వేళకు వచ్చి జ్వరం కొలిచి రాసుకుని వెళ్ళిపోయింది. మేల్ నర్సు వచ్చి ఇంజక్షను ఇచ్చి వెళ్లాడు.

వేణు సామాన్యంగా వాళ్ళతో మాట్లాడడు. ప్రశ్నలు వేయడు. వస్తుంటే చూస్తాడు. మందిపోస్తే తాగుతాడు. ఇంజక్షను ఇస్తే తీసుకుంటాడు. అతడిని చూసి వాళ్ళనుకుంటారు పేషంటు చాలా దిగులుగా ఉన్నాడని.

ఆరున్నర కాగానే దీపాలన్నీ వెలిగిస్తారు.

వేణు గది ఎప్పుడూ ఓరవాకిలిగా వేసి ఉంటుంది. అతడు కళ్ళు తెరచుకున్నప్పుడు, ఆ వాకిలివైపు చూస్తాడు అప్పుడప్పుడు.

వేణు తలుపులవంక చూస్తున్నవాడల్లా ఉలికిపాటుగా లేచి కూర్చున్నాడు. లేత నీలంరంగు చీరె తలుపు సందులలో నుంచి కనబడ్డది. పొరబడ్డాడేమో అనుకోవటానికి వీలులేదు. ఐదునిమిషాలసేపు కనబడ్డది.

"ఎవరది? లోపలికి రావచ్చు" అన్నాడు సంభ్రమంతో.

మరో రెండు నిముషాల తర్వాత "ఎవరూ అక్కడ నిలబడ్డది? తలుపులు బాగా తెరవండి" అసహనంగా అడిగాడు.

చప్పున లేతనీలంరంగు చీర మాయమయింది. యథా ప్రకారం దీపపు కాంతులు తలుపు సందులగుండా ప్రసరించాయి.

హతాశుడైనట్టుగా వేణు పక్కమీద వాలిపోయాడు. ఏదో పోగొట్టుకున్నట్టుగా ముఖం వేలాడిపోయింది.

తలుపులు దభాలున నెట్టుకుంటూ రంగారావు టిఫిన్ కారియరుతో లోపలికి వచ్చాడు.

ఆవేళప్పుడు సాధారణంగా కొడుకు ముఖం కడుగుకొని తలదువ్వుకుని ఏదో పత్రిక చేతపట్టుకుని కనబడతాడు. ముఖం పక్కకు తిప్పుకున్న వేణును చూడగానే ఒక అడుగు వెనక్కు వేశాడు రంగారావు.

రంగారావు వేణును పలకరించకుండా ఆ గదిలో వస్తువులన్నీ చక్కగా సర్దుతూ పావుగంట గడిపాడు. ముఖం తుడుచుకుంటూ మంచం దగ్గరగా కుర్చీ లాక్కుని స్థానిక వార్తలు - రాష్ట్ర రాజకీయాలు - కేంద్రంలో ఆలజడులూ మెల్లగా చెప్పటం మొదలు పెట్టాడు.

"వేణూ! అమ్మ నీకు ట్రాన్సిస్టరు పంపించిందిరా. నేను వచ్చేటప్పుడు తీసుకువద్దామనుకున్నాగాని - బ్యాటరీలు కొత్తవి వెయ్యాలన్నాడు సుందర్. అందు కని ఆగాను. రేపు వచ్చేటప్పుడు తీసుకువస్తాలే" అన్నాడు మామూలుగా.

వేణుకు ఒళ్ళు మండిపోతున్నది. తను యం. కాం. చదివాడు. టొబాకో కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు- ముప్పైఏళ్లు దాటినవాడు. ఇద్దరు పిల్లల తండ్రి. తనతో తండ్రి చిన్నపిల్లవాడితో మాట్లాడినట్లు మాయమాయగా మాట్లాడు తున్నాడు. తండ్రిని ముఖమ్మీద నాలుగూ అడిగేయాలని ఉంటుంది. కాని - చిన్నప్పటినుంచీ తండ్రి దగ్గర చనువు తక్కువ. కావలసినవన్నీ తల్లి నడిగే తీసు కునేవాడు. తండ్రితో ఏదయినా చెప్పవలసి ఉంటే తల్లిచేత చెప్పించేవాడు. ఉద్యోగంలో ప్రవేశించిన తరువాత తండ్రితో మర్యాదగా - కొద్దిగా స్నేహభావంగా మాట్లాడటం అలవరచుకున్నాడు.

ఆ మరునాడు వేణుకు పోస్టులో ఉత్తరం వచ్చింది.

దస్తూరి చూడగానే ముఖం కొంచెం విప్పారింది. "మనిషి రాకపోయినా ఉత్తరం రాసింది నయమే" అనుకుంటూ విప్పాడు.

"వేణూ! నేనొచ్చాను. ఇక్కడికి రావాలన్న నా మనోరథం ఈడేరింది. వచ్చాను. పిల్లలను అమ్మ దగ్గర ఉంచి-నేను ఉత్తరం రాయగానే తీసుకువచ్చే ఏర్పాటు చేసి వచ్చాను. మీకు చదివి వినిపించటానికి బుట్టనిండా పుస్తకాలు నింపు కుని తీసుకువచ్చాను. మీకు ఇష్టమయిన టిఫినులు తీసుకువచ్చాను. మిమ్మల్ని కంటితో చూడవచ్చుననే ఆశతో వాయువేగ మనోవేగాలతో వచ్చాను. మీకు ఇష్ట మయిన వంటకాలుచేసి టిఫిన్ కారియరుతో పెట్టుకుని మీ పుట్టినరోజుకు మీరు నాకు కొని ఇచ్చినచీరె కట్టుకుని బయలుదేరాను.

కాని - గంపెడాశతో వచ్చిన నన్ను మీ నాన్నగారు తలుపు దగ్గరే ఆపే శారు. తలుపు సందులుగుండా చూడమన్నారు. దుఃఖం ముంచుకు వచ్చింది. "అయితే ఇంటికి వెళ్ళ"మన్నారు.

నా బాధనంతా దిగమింగి తలుపు సందులలో నుంచి చూశాను. తలుపు వైపే చూసే మీ కళ్ళను చూశాను. ఇంజక్షన్లతో - మందులతో కొంచెము ఒళ్ళు చేసి - తెల్లగా మిసమిసలాడే మీ ముఖం చూశాను. మాట్లాడాలన్న ఆవేశంతో తలుపులు నెట్టుకుని లోపలికి రాబోయాను. మీ నాన్న చెయ్యి పట్టుకుని లాక్కు-వెళ్ళారు.

సినిమా చూసినట్టుగా మిమ్మల్ని చూడగలిగాను. అలా అయిదు నిమిషాలు తలుపు సందులగుండా నేను నిబ్బరంతో చూడగలిగితే ఇక్కడ ఉంచుతారట. లేకపోతే రేపే రైలెక్కిస్తారట.

నే నందుకు ఒప్పుకున్నాను. ఆడినమాట తప్పనని మీమీద ఒట్టేసుకున్నాను లోపలికి వచ్చి చూసి - మీతో మాట్లాడటానికి ప్రయత్నించను. మనోభావాలను అరికట్టాను. ఉద్రేకాలను అదుపులో పెట్టుకోవటానికి ప్రయత్నిస్తాను. నిబ్బరంగా ఉండటం అలవరచుకుంటాను.

నిర్లిప్తంగా పరోక్షంగా మీకు సేవచేయటానికి నిశ్చయించుకున్నాను పిల్లలను పిలిపించే మాట తలపెట్టను. రోజూ వస్తూ - వుంటా సరిగ్గా 6-30 లేక 7 గంటలకు, మీకనుచూపయినా లభిస్తుందనే ఆశతోను.

మీ దీప''

వేణు అదిరిపడి లేచి కూర్చుని మళ్ళీ చదివాడా ఉత్తరాన్ని,

దీప వచ్చేసిందన్న మాట. పాపం నన్ను చూడాలన్న గంపెడాసతో వచ్చింది. నాన్న ఇంత కఠినంగా ఎట్లా ఉండగలుగుతున్నాడు? నా కేమీ తెలియ దని ఎంత తియ్యగా మాటలు చెప్పి మరపించాలని చూస్తున్నాడు?

అప్పుడతడికి వచ్చిన కోపం అంతకు ముందెప్పుడూ రాలేదు. ఆ రోజు టెంపరేచర్ చూడటానికి వచ్చిన నర్సును విదిలించికొట్టాడు. ఇంజక్షను తీసుకోనని మొండికెత్తాడు. అశాంతిగా ఇటూ అటూ తిరగటం మొదలుపెట్టాడు.

తండ్రి మామూలు వేళకు టిఫిన్ కారియరు తీసుకుని మెల్లిగా అడుగులో అడుగు వేసుకుంటూ వచ్చాడు. తండ్రి ముఖం చూడగానే వేణు ముఖం జేవు రించింది. పళ్లు పటపట కొరుకుతూ ''నాన్నా! నన్ను మోసం చేయాలని ఎందుకు

చూస్తున్నారు? జరిగేది ఒకటీ-నాతో చెప్పేది ఒకటీనా? ఈ వయసులో కూడా ఎందుకు నాన్నా ఈ కుట్రలు? ఈ మోసాలు ఎందుకు?" ఇంచుమించుగా అరిచాడు.

"ఏమిటి బాబూ, ఏమిటది?" టిఫిన్ కారియర్ అక్కడ పెట్టి కొడుకును రెండు చేతులతో పొదివి పట్టుకున్నాడు.

"దుర్మార్గుడా! దూరంగా ఉండు. నన్నింత మోసం చేస్తావా?" తండ్రిని నెట్టినంత పనిచేశాడు వేణు. ఆయాసం కొద్దీ రొప్పుతున్నాడు.

రంగారావు కాలింగ్‌బెల్ నొక్కాడు. వెంటనే నర్సులిద్దరు పరుగెత్తుకుంటూ వచ్చారు. వేణును అందరూ పట్టుకుని బలవంతంగా మంచంమీదకి చేర్చారు.

"నాన్నా! ఎందుకిట్లా చేశావు? పుట్టెడు రోగంతో తీసుకుంటున్నానే! నన్నిట్లా దుఃఖపెడతావా?" పట్టలేక బిగ్గరగా ఏడ్చాడు వేణు.

"నేనేం చేశానురా వేణూ! నీ జబ్బు తగ్గిపోతేచాలునని వేయి దేవుళ్ళకు మొక్కుకుంటున్నానురా తండ్రీ. మనసు కుదుటపరచుకో బాబూ!" మంచమ్మీద కూర్చుని వెన్నుమీద రాస్తున్నాడు రంగారావు

"ఇంత మోసంచేసి పైకి ఏమీ ఎరగనట్టు ప్రేమ ఒలకపోస్తావా? దీప విషయంలో నీవు అబద్ధమాడ లేదూ? నిజం చెప్పు!" లేచి కూర్చున్నాడు వేణు.

"నేనేం చేసాను? దీపను పిలిపించమన్నావు. ఉత్తరం రాశాను. పిల్లలను తీసుకుని వస్తానంది. బయలుదేరుతున్నట్టు ఉత్తరంవస్తే స్టేషనుకు వెళ్ళి తీసుకువస్తాను. సరేనా?" మెల్లగా సమాధానమిచ్చాడు రంగారావు

"కాదు అన్నీ అబద్ధాలు. దీప వచ్చింది. నన్ను చూడాలనివస్తే నీవు లోపలికి రానీయలేదు. అవునా-కాదా?" గద్దిస్తున్నాడు వేణు.

అంతలో డాక్టరు లోపలికి వచ్చాడు. రంగారావు తటాలునలేచి నిలబడ్డాడు.

ఏమిటన్నట్టు డాక్టరు రంగారావుకేసి చూశాడు. వేణు చెయ్యి పట్టుకుని నాడి చూస్తున్నాడు.

"ఏం లేదండీ! ఏదో మాటా మాటా వచ్చి ఉద్రేకపడుతున్నాడు. నేను వర్ది చెబుతున్నాను." అన్నాడు రంగారావు.

వేణు ముఖం కందగడ్డలా అయింది. తండ్రిని చెడా మడా తిట్టెయ్యాలని లేచి కూర్చోబోయాడు.

డాక్టరు రెండు చేతులలో వారించి "మిస్టర్ వేణు. శాంతంగా ఉండాలి మీరు. కాఫీ తీసుకున్నారా? వేళ దాటలేదూ? ఉద్రేకం పనికిరాదు" కుర్చీ మంచానికి దగ్గరగా లాక్కుని కూర్చున్నాడు.

"డాక్టర్! నేనేదయినా సహిస్తాను. కాని - మోసాన్ని సహించలేను. ఈ లోకంలో తండ్రులు కొడుకులను కూడా మోసం చేస్తారు. ఇంతకంటే నీచం ఎక్కడయినా ఉన్నదా? నాకు లోకమ్మీదే అసహ్యం పుడుతోంది. నిన్నటివరకూ నాకు జబ్బు నయం చేసుకుని తొందరగా ఇంటికి వెళ్లాలని ఉండేది. కాని నిన్న మధ్యాహ్నం నుంచీ ఇక్కడ ఈ హాస్పిటల్లో ఈ మంచం మీదనే ప్రాణం విడవాలనుంది. నాకు మీరు మందులూ ఇంజక్షన్లూ ఇవ్వకండి. ఇచ్చినా నా సహకారం లేనిదే అవి పని చేయవు" కళ్ళమీద చేతులు పెట్టుకుని పక్కకు తిరిగాడు.

డాక్టరు చేతిసైగ చేయగానే రంగారావు గదిలోనుంచి వెళ్ళిపోయాడు.

హాస్పిటల్ భవనం చుట్టూ వేపచెట్లు వేశారు. ఆ వేపచెట్లు ఆరోగ్యవంతమయిన గాలిని పెద్దపెద్ద కిటికీలగుండా రోగుల మనసులనూ, దేహాలనూ చల్లబరచటానికి పంపుతూ ఉంటాయి. మండువేసవిలో కూడా ఆ వేపచెట్లవల్లనే ఆ హాస్పిటలు చల్లగా మంచుకొండ మీద ఉన్నట్టుగా ఉంటుంది.

డాక్టరు చేతిలో వేణు చెయ్యి ఉన్నది. మాట్లాడటం ఇష్టంలేక వేణు కళ్ళు మూసుకున్నాడు. కొంతసేపటికి వేణు నిద్రలోకి జారుకోవటం చూసి డాక్టరు గది తలుపులు దగ్గరగావేసి వెళ్ళిపోయాడు.

మరునాడు ఉదయం గతదినం జరిగిన విషయాలను జ్ఞాపకం చేసుకోవడానికి వేణు ప్రయత్నిస్తున్నాడు. తండ్రితో మాటా పలుకూ లేకుండా పెట్టినదేదో తిన్నాడు. తండ్రి తలుపులు దగ్గరగావేసి ఇంటికి వెళ్ళాడు.

ఆ రోజు వేణు చాలా విరక్తుడుగా ఉన్నాడు. ఎవరికోసం ఎదురుచూడటం లేదు. గోడవైపు ముఖంచేసి పడుకున్నాడు.

పోస్టుమెన్ ఉత్తర మొకటి బల్లమీద పెట్టి వెళ్ళాడు. వేణు నిర్లక్ష్యంగా పడుకున్నాడు. కాని చాలాసేపు అలా నిర్లిప్తంగా పడుకోలేకపోయాడు. ఆ ఉత్తరం ఎక్కడినుంచో అతడికి బాగా తెలుసు ఆ ఉత్తరం రాసినవాళ్లు తన వెనక ఉన్నట్టే అనిపించటం మొదలుపెట్టింది.

దిగ్గున లేచి కూర్చుని ఆ ఉత్తరం అందుకుని చింపి చదివాడు

"వేణూ, మీ సంగతులు నాకు ఎప్పటికప్పుడు చేరే ఏర్పాటు చేసుకున్నాను. మీ దగ్గరుంటున్న నర్సు నాకు రోజుకు మూడుసార్లు టెలిఫోను చేసే ఏర్పాటు చేసుకున్నాను. మేము ఉంటున్న ఇంటికి రెండిళ్ళ అవతల బేకరీషాపు ఉంది. అక్కడికి వెళ్ళి నేను ఫోను చేయగానే ఆమె నాతో అన్ని సంగతులు చెబుతుంది. నేను పంపుతున్న కాఫీ నచ్చుతున్నదా? మీకు అలవాటని కొద్దిగా పంపుతున్నాను. అసలు మీరు పాలే ఎక్కువగా తాగాలి. వంట బాగుంటున్నదా? నేను ఇటీవల నేర్చుకున్న కొత్త వంటకాలు రోజుకొకటి వంతున చేసి పంపుతున్నాను. హాస్పిటల్లో మంచమ్మీద ఉంటే ఎవరికయినా భోజనం హితవనిపించదు. కాని- హితవు చేసుకోవాలి.

పాపం, మామగారు ఎందుకో చిన్నబుచ్చుకుని తిరుగుతున్నారు. ఆయన మనసు చాలా బాధపడుతున్నది. కన్నీరు గారుస్తూ భోజనం చేస్తున్నారు. ఆయనను చూస్తుంటే నా మనసంతా అల్లకల్లోలమయి పోతున్నది. ఆయన నా తండ్రివంటి వారు. ఆయన బాధను చూడలేకుండా ఉన్నాను. ఆయన నన్ను ఏ మాటన్నా నా మంచికేనని భావించుకుంటే నా కెంతో శాంతిగా ఉంది.

నా మనస్సిప్పుడు చాలా ప్రశాంతంగా ఉంది. నా ప్రేమ మూర్తిని పరోక్షంగా ఆరాధిస్తున్నాను. మీ దగ్గరనుంచి ఉత్తరం రాలేదనిగాని- మిమ్మల్ని చూడాలనిగాని- మీతో మాట్లాడాలనిగాని నా మనసిప్పుడు ఆరాటపడటంలేదు. మీకు కావలసినది సమకూరుస్తూ- మీ క్షేమాన్ని కాంక్షిస్తూ మంచిరోజు కోసం ఎదురు చూడటంలోనే నాకానందం కలుగుతోంది. మీరు కూడా నాలా ఉండటానికి ప్రయత్నించండి.

మీ దీప"

ఉత్తరం చదువుతుంటే వేణు కళ్ళ వెంబడి నీరుగారి తలగడ అంతా తడిసింది.

ఇది జరిగిన వారం రోజులకు వేణుకు ముక్కులోనుంచి నోట్లోనించి రక్త స్రావమయింది. లాభంలేదని తెలిసికూడా సూపర్నెంటు ఆఖరి ప్రయత్నం వైద్యుడిగా చేయవలసి ఉన్నది కనుక తండ్రి సమ్మతితో ఆపరేషను చేశాడు.

ఆపరేషను జరిగింది. రోగిని తీసుకువచ్చి మంచమ్మీద పడుకోబెట్టారు. దీపవచ్చి అతడికి దగ్గరగా కూర్చుని అతడి చేతులను తన నుదుటికి ఆనించుకుని, కళ్లు మూసుకుంది.

వేణు అరగంట తరువాత కళ్లు తెరిచాడు. తలుపు దగ్గరగా నిలబడ్డ తండ్రిని చూశాడు. తలదగ్గరగా నిలబడ్డ తల్లిని ఒక నిమిషంసేపు చూశాడు. భయంతో గోడ కానుకుని నిలబడ్డ పిల్లలను కళ్ళెత్తి చూశాడు. జ్యోతుల లాంటి కళ్ళతో తననే తదేకంగా చూస్తున్న దీపను కళ్లారా చూశాడు. అంతే- తలవాల్చేశాడు

మరునాడు ఉదయం తండ్రి రంగారావు కన్నీళ్ళు కారుస్తూ ఆ గది ఖాళీ చేయటానికి వచ్చాడు కొడుకు వస్తువులూ బట్టలూ అన్నీ కాల్చేశాడు. వేణు తల క్రింద భద్రంగా సిల్కు రుమాలులో ఉన్న ఉత్తరాల కట్టను చూసి బావురుమన్నాడు.

అతడు ఇంటికి తీసుకురావలసిన వస్తువులేవీ కనబడలేదు. చెంబు గ్లాసు ఫ్లాస్కు వంటివి కడిగి అక్కడ ఉన్న పేదరోగులకు ఇచ్చేశాడు. సిల్కురుమాలు మూటను కన్నీళ్ళతో ఇంటికి తీసుకు వచ్చాడు.

''అమ్మా దీపా! నా కొడుకునూ వాడి వస్తువులనూ కాల్చివేయగలిగాను. కాని- వాడు ప్రాణపదంగా చూసుకున్న ఈ ఉత్తరాల కట్టను కాల్చివేయలేక నీ కోసం తీసుకువచ్చానమ్మా. ఇవే నేను మిగల్చగలిగినవి'' కోడలి రెండు చేతులలో ముఖం దాచుకుని ఏడ్చాడు.

శివరావుతోపాటు పరమేశం నరహరీ కూడా కళ్ళు అద్దుకున్నారు

కొంతసేపటికి నరహరి ముందుగా తేరుకుని ''ఏమిటయ్యా! ప్రేమలేఖలు. ప్రేమలేఖలని కంటతడి బెట్టించావు?'' అన్నాడు.

''శివరావూ! నీకూ ఆ ఉత్తరాలకూ ఏం సంబంధం?'' అడిగాడు పరమేశం.

''దీప నా పెద్ద కూతురయ్యా బాబూ!'' కళ్లు ఒత్తుకున్నాడు శివరావు.

ఇంకా ముగ్గురూ అలా కూర్చునే ఉన్నారు. ప్రణయంలో నుంచి - దాని పరిణామాలలోనుంచి ఇంకా తేరుకోలేదు. ముగ్గురూ కొత్త సిగరెట్లు అందుకొని వెలిగించుకున్నారు.

ముగ్గురూ ఒక్కసారే అదిరిపడి వెనక్కి తిరిగి చూశారు. లోపలినుంచి ఎవరిదో నవ్వు వినబడుతోంది. రెండు నిమిషాలకు, చెదరిన క్రాపుతో - నలిగిన బట్టలతో తూలిపోతూ పాతికేళ్ళ మనిషి వచ్చి వాళ్ళ కెదురుగా పిట్టగోడమీద కూర్చున్నాడు.

''మీరు ముగ్గురూ క్లబ్బుకు క్రమంతప్పకుండా వస్తారు. బుద్ధి ముట్టుకోలేరు. అంతా వయసుమళ్ళిన వాళ్లు. ఎంతసేపటినుంచో ప్రణయాన్ని గురించి మాట్లాడు కుంటున్నారు'' విరగబడి నవ్వాడు.

ముగ్గురూ దిగ్భ్రాంతులై చూస్తున్నారు.

''ఆ కబుర్ల వల్ల మీ హృదయాలేవన్నా పరవశించిపోయాయా? సాంసారిక మయిన కష్టసుఖాలు చెప్పుకుని ముగ్గురూ కన్నీరు కారుస్తున్నారు. అది కాదు ప్రణయ మంటే. ఇదిగో నా జేబులో ఉన్నాయి. ప్రణయలేఖలు- రెండు కట్టలు. ఒక కట్ట ఒక అమ్మాయి ఒక అబ్బాయికి రాసినవి. ఇంకో కట్ట అబ్బాయి అమ్మాయికి రాసినవి, ఇద్దరూ విద్యార్థి దశలో సరిహద్దులు లేని యౌవ్వనపు పొంగులో కలుసుకున్నారు. ఇప్పుడిద్దరికీ వివాహాలయ్యాయి. వేరువేరుగా ఈ ఉత్తరాలు వాళ్ళ జీవిత భాగస్వాములకు చూపిస్తానని బెదిరిస్తే నాకు వేలకు వేలు లాభము. అబ్బాయి రాసిన ఉత్తరాలు అమ్మాయి పెనిమిటికి చూపిస్తే పిడుగులు పడతాయి. ఇంట్లో చిచ్చు రేగుతుంది. ఆ సంసారం నాశనమయి పోతుంది. అమ్మాయి రాసినవి అబ్బాయి భార్యకు చూపిస్తే ఆ యింట్లో ప్రళయం తాండవిస్తుంది. ఇల్లరికపు అల్లుడు గజగజ లాడుతాడు. ఇంట్లోనుంచి ఉద్వాసన చెబుతారు అత్తమామలు.

ఈ ఉత్తరాల కట్టలు చదువుతారా? ఇప్పుడు వాళ్ళ జీవితాలను నాశనం చేసే ఈ ఉత్తరాలు ఇతరులు చదివితే మనసులు పరవళ్ళు తొక్కుతాయి ఆ ప్రణయం మనిషిని ఎట్లా కాల్చేస్తుందో; ఎటువంటి పనులు చేయిస్తుందో- ఎట్లా

రాయిస్తుందో ఆ దశలో ఉన్నవాళ్ళకు అర్థంకాదు. వాళ్లే తర్వాత వాటిని చదువు కోవటం తటస్థించితే ఎట్లా ఉంటుంది?" కడుపు పట్టుకుని నవ్వుతున్నాడు.

"ఎట్లా ఉంటుందా? అది పదికాలాలపాటు నిలిచిన ప్రణయమైతే- ఆ రాసినవారు తిరిగిచదువుకుంటే 'అబ్బా! ఇట్లారాసుకున్నామా!' అంటూ తన్మయు లవుతారు. అది పొంగులాంటి ప్రణయమయితే 'ఏదో- అదోపిచ్చి ఆ పిచ్చిలో రాసుకున్న' అనుకుంటారు సాంఘికామోదం లేని ప్రణయమైతే ఆ లేఖలు తరువాత వాళ్ళెప్పుడయినా చదువుకోవటం తటస్థించితే సిగ్గుతో తలలు వంచుకుం టారు" అన్నాడు శివరావు.

మళ్ళీ పక్కున నవ్వాడు ఆ యువకుడు.

"అయ్యో! పెద్ద మనుషులూ! చాటుమాటు ప్రణయమే దినదిన ప్రవర్ధ మానవుతుంది. హద్దులులేని పరిస్థితులలోనే ప్రణయము పొంగుతుంది. ఆ ఉత్త రాలే మజాగా ఉంటాయి!"

ముగ్గురూ మాట్లాడకుండా అతడినే చూస్తున్నారు.

"మీ ముగ్గురిలో నరహరి ఎవరు? శివరావు ఎవరు?" అడిగాడు యువ కుడు

ఉలిక్కిపడ్డారు నరహరీ, శివరావు.

"ఏం? ఎందుకు?" ఇద్దరూ ఒకసారే ప్రశ్నించారు

"ఎందుకా? మీ అడ్రసులు తెలుసుకుని మీ ఇళ్లకు రావాలి" అన్నాడు ధీమాగా.

"ఏం పని?" ఆశ్చర్యంతో తడి ఆరిపోయిన గొంతుతో అన్నారు.

"ఏం పనా? ఇప్పుడే చెప్పానా? నా జేబులో ఉన్న ఉత్తరాల కట్టలు తీసుకువస్తా. మీకు చూపించి వేలకువేలు సంపాదిస్తా. చెప్పండి మీరు ఏఏ వేళల్లో ఇంట్లో ఉంటారో? రెండు కాళ్ళూ దూరదూరంగా పెట్టి ఉత్తరాల కట్టలు చేతిలో పట్టుకుని చూపిస్తూ అడిగాడు.

గుండెలు ఝల్లుమన్నవి శివరావుకూ, నరహరికి.

"మీ ఇద్దరిలో ఎవరి అమ్మాయి అమృతవల్లి ? ఎవరి అబ్బాయి మురళి ?" గంభీరంగా ఉంది అతడి కంఠం.

"నా కూతురు అమృతవల్లి, అయితే ఏమంటావు ?" దబాయించబోయాడు నరహరి.

"అయితే ఏమా ? ఇవిగో ఆమె విద్యార్థినిగా ఉండగా సహాధ్యాయికి వ్రాసిన ఉత్తరాలు. అవి నా చేతిలో ఉన్నాయి. ఇవి అమ్మాయి భర్తకు చూపిస్తే నాకు కనీసం పదివేలు వస్తాయి. చూపించమంటారా ?" చేతిలో ఉన్న కాగితాల కట్టను ఆడించి చూపించాడు.

"చూపించు ! డబ్బు సంపాదించుకో !" బెదిరిస్తున్నట్టుగా అన్నాడు.

"అలాగా ? మీ పరువు ప్రతిష్ఠల మాట ?" గతుక్కుమన్నాడు నరహరి.

"ఏమండీ శివరావుగారూ ? మీ మురళి మాట ఏమిటి ?" శివరావు వైపు తిరిగాడు.

"ఏదో క్లబ్బులో కాలక్షేపం చేద్దామని వచ్చిన వాళ్ళము, మా దగ్గర డబ్బేముంటుంది ? అయినా మా మురళే ఆ ఉత్తరాలు రాసినట్టు దాఖలా ఏమిటి ?" దబాయించబోయాడు శివరావు.

"అలాగా ? ఇవిగో ఫోటోలు మీ మురళి ఫోటో ఇదిగో బాగా చూడండి. ఇదిగో అమృతవల్లి ఫోటో చూసుకోండి" రెండు ఫోటోలూ చూపించాడు.

"సరే నీ ప్రజ్ఞ చూపించావు. రేపీ వేళకు ఇక్కడే కనబడు. మేమిద్దరం చెక్కులు రాసి పట్టుకొస్తాం. ఈ భాగ్యానికి ఇళ్ళకు కూడా ఎందుకు ?" శివరావు కూర్చున్న చోటనుంచి లేచాడు స్నేహితులిద్దరికీ కంటితో సైగచేశాడు లేవమని.

ముగ్గురు లేచి వెళ్లుతుంటే అతడు వాకిలి వరకూ వచ్చి "ఏమండోయ్, నా చెక్కులు మాట మరచిపోకండి, రేపు తీసుకువచ్చి ఇవ్వకపోతే మీ ఇళ్ళకు రావటం తథ్యం."

తలలు వంచుకుని ముగ్గురూ గబగబా అడుగులు వేస్తూ సాగిపోయారు.

తూలుతూ నవ్వుకుంటూ లోపలికి వెళ్ళిపోయా డతడు.

('అనామిక' ప్రత్యేక సంచిక)